# మనం

/manamnews
www.manamnews.com

జనం కోసం అక్షర యజ్ఞం..

కరీంనగర్
బుధవారం
29-11-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 301
పేజీలు : 8

KARIMNAGAR | HYDERABAD | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


కార్తీక మాసం, బుధవారం, తిథి. విదియ మ.01.57 వరకు, నక్షత్రం: మృగశిర, మ:01.59 వరకు, వర్జ్యం: సా.10.44-12.25 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.42-12.26 వరకు, రాహుకాలం: మ.12.04-01.27 వరకు

## రాష్ట్రపతికి కొత్త ఓటరు కార్డు



**న్యూఢిల్లీ, నవంబర్ 28 :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొత్త ఓటరుకార్డు అందుకున్నారు. ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పి.కృష్ణమూర్తి మంగళవారం స్వయంగా రాష్ట్రపతి భవన్‌కు వచ్చి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కొత్త ఓటరు కార్డును అందజేశారు.ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా తెలియజేసింది.ఢిల్లీ ఎన్నికల అధికారి కృష్ణమూర్తినుంచి రాష్ట్రపతి ఓటరుకార్డు అందుకున్నట్లు తెలిపింది. ఒడిశాకు చెందిన ద్రౌపది ముర్ము గత ఏడాది జులై 25న బారత రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఆమె తన ఓటుహక్కును ఒడిశానుంచి ఢిల్లీకి మార్చుకున్నారు. ఆమె రాబోయే ఎన్నికల్లో న్యూఢిల్లీ జిల్లానుంచి తన ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ద్రౌపది ముర్ము పాత ఓటరుకార్డులో ..మిగతా 2లో



### ఒకే విడతలో

# దళితబంధు

- తెలంగాణే ఆశగా శ్వాసగా బతుకుతున్నా
- గజ్వేల్ నా గౌరవాన్ని పెంచింది..
- ఈ స్థాయికి తెచ్చింది
- ఆర్ఆర్ఆర్‌తో గజ్వేల్ దశ మారిపోతది
- ఐటి హబ్‌గా మార్చుతా
- భూ నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తాం
- ఇందిరమ్మ రాజ్యమొస్తే మళ్లీ చీకటి రోజులు
- రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్

**సిద్దిపేట/గజ్వేల్, నవంబర్ 28 (మనం ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి సిద్దిపేట గడ్డ ఊపిరినిస్తే సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి చేసుకునేందుకు ఊతమిచ్చిన గడ్డ గజ్వేల్ అని... గజ్వేల్ నా గౌరవాన్ని పెంచింది.. తెలంగాణను ఈ స్థాయికి తీసుకువచ్చింది.. జరగబోయే అభివృద్ధికి బాటలు వేసిందంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ చిట్టచివరి ప్రచార సభను తాను పోటీ చేస్తున్న గజ్వేల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనలో అంతా ఆగమాగం.. దళితుల బతుకులు ఏమాత్రమూ మారలే..వారి బతుకుల్లో మార్పు తీసుకువచ్చిన పథకం దళితబంధు. ముచ్చటగా మూడోసారి గజ్వేల్ ప్రజలు నన్ను దీవిస్తే మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తది.. ప్రభుత్వం ఏర్పడిన వెనువెంటనే నియోజకవర్గంలోని దళితులందరికి ఏక కాలంలో దళితబంధు ఇచ్చే బాధ్యత నాది అన్నారు. రెండుసార్లు గెలిపిస్తే మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా శక్తివంచన లేకుండా రాష్ట్రాభివృద్ధికి కృషి చేశా. రాబోయే రోజుల్లో గజ్వేల్ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందబోతుందన్నారు. భూ నిర్వాసితుల త్యాగం వెలకట్టలేనిది. వారి త్యాగమే 12 జిల్లాలకు సాగునీళ్లనిచ్చే ఖజానా మల్లన్న సాగర్‌ను ఏర్పాటు చేసింది. వారందరినీ కాపాడుకునే బాధ్యత నాది. రాబోయే రోజుల్లో డజన్ వరకు కాలుష్య రహిత పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి కల్పించే బాధ్యత స్వయంగా తీసుకుంటానన్నారు. మల్లన్న సాగర్ రాబోయే రోజుల్లో ప్రముఖ టూరిస్ట్ స్పాట్‌గా మారబోతుంది. అదేవిదంగా కొండపోచమ్మ, మల్లన్న దేవాలయం, నాచారం దేవాలయాలను అద్భుతంగా తీర్చిదిద్దుకుందామన్నారు. రాష్ట్రం మరింత బాగుపడాల్సిన అవసరం ఉంది. కొద్ది రోజుల్లో నాకు 70ఏండ్లు వస్తున్నాయి.. తెలంగాణ రాష్ట్రానికి సాధించిన కీర్తే నాకు ఎనలేని సంతృప్తినిచ్చింది. మీ అందరి దయతో ..మిగతా 2లో



## బీఆర్ఎస్‌కు ఓటేస్తే మళ్లీ దొరల సర్కార్

- కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజా సర్కార్ వస్తుంది
- బీజేపీ చెప్పిన చోటే ఎంఐఎం అభ్యర్థులు పోటీ
- కాంగ్రెస్‌ను దెబ్బ తీయాలనే 'పతంగి' పార్టీ పోటీ
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- నాంపల్లిలో కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న రాహుల్

వివరాలు.. 2లో

## తెలంగాణలో కాంగ్రెస్ తుఫాన్



- సర్వశక్తులు ఒడ్డి జనం గెలిపిస్తరు
- ఆరు గ్యారెంటీలను అమలు చేస్తం
- మీతో నాది కుటుంబ సంబంధం
- మల్కాజిగిరి రోడ్ షోలో రాహుల్ గాంధీ

2



## ఆపరేషన్ టన్నెల్ సక్సెస్

- సొరంగంలో చిక్కుకున్న 41 మంది కూలీలు క్షేమంగా బయటికి
- ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 17 రోజుల సుదీర్ఘ నిరీక్షణకు శుభం కార్డు
- మానవత్వానికి, సమిష్టి కృషికి నిదర్శనం
- రెస్క్యూ టీమ్‌కు ప్రధాని ప్రభృతుల హ్యాట్సాఫ్

వివరాలు.. 2లో



## కామారెడ్డిని దేశం గమనిస్తోంది

- తెలంగాణ దశదిశను మార్చే తీర్పు ఇవ్వాలి
- భూములను కొల్లగొట్టేందుకే కేసీఆర్ కామారెడ్డిలో పోటీ
- టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

**కామారెడ్డి, నవంబర్ 28 (మనం న్యూస్):** తెలంగాణ దశదిశను మార్చే తీర్పును కామారెడ్డి ప్రజలు ఇవ్వాలని.. ఇక్కడి తీర్పును దేశం నిశితంగా ..మిగతా 2లో

## అభివృద్ధి సంక్షేమమే ఎజెండా

- అమాయకులను కేసుల పాలు చేసిన పాలన ఆర్‌డిఆర్‌ది
- కారుగుర్తుకు ఓటు వేస్తే వెలుగు.. హస్తానికి వేస్తే చీకట్లు
- కనీసం మూసి గేటును రిపేరు చేయాలనే సోయిలేని దామోదర్‌రెడ్డి
- పేటను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతా
- పేదల కడుపు చూసే నాయకుడు కేసీఆర్
- ఎన్నికల ప్రచార సభలో మంత్రి జగదీష్‌రెడ్డి

వివరాలు.. 6లో



- దొంగ వీడియోలు సృష్టిస్తే చరిత్ర హీనుడైతావు
- బీఆర్ఎస్ నేతలు డబ్బుతో ఓట్లు కొనే పనిలో పడ్డారు
- ఎన్ని జిమ్మిక్కులు చేసినా కరీంనగర్‌లో ఎగిరేది బీజేపీ జెండానే
- కార్యకర్తలంతా డిసెంబర్ 3న విజయోత్సవ ర్యాలీకి సిద్ధంగా ఉండండి
- కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్

వివరాలు.. 6లో

## గంగులా.. నా సహనాన్ని పరీక్షించకు





## మీరే నా కుటుంబం

- ప్రతి రోజు 18 గంటలు పని చేస్తున్నా
- అభివృద్ధికి పట్టం కట్టండి
- అభివృద్ధిని ఓర్వలేని పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పండి
- మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ అభ్యర్థి తన్నీరు హరీష్‌రావు

2

గుండె గులాబీల స్వాగతం

### మంచిమాట

జ్ఞాపకాలు ఎప్పుడూ ప్రత్యేకమైనవి ఒక్కోసారి మనం ఏడ్చిన రోజులు గుర్తు వచ్చిన మరో సారి మనం నవ్విన రోజులు గుర్తు చేసుకుంటూ ఏడుస్తాం.

శుభోదయం

## బండి సంజయ్ గెలిస్తే సీఎం అవుతారు

- యుద్ధ వీరుడు సంజయ్‌కు అండగా మోదీ ఉన్నడు
- లక్ష మెజారిటీతో బండి సంజయ్‌ను గెలిపించండి
- బీజేపీ మహాబైక్ ర్యాలీలో మంద కృష్ణ మాదిగ




**కరీంనగర్, నవంబర్ 28 (మనం బ్యూరో):** కరీంనగర్ నియోజకవర్గం నుంచి బండి సంజయ్‌ని ఎమ్మెల్యేగా గెలిపిస్తే తెలంగాణకు సిఎం అవుతారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ వ్యాఖ్యానించారు. యుద్ధవీరుడు బండికి ప్రధాని మోడీ అండగా ఉన్నారని, కరీంనగర్ నుంచి ఆయనను అసెంబ్లీకి పంపే బాధ్యత ప్రజల దేనన్నారు. అన్ని వర్గాల ప్రజలు బండి సంజయ్‌కు మద్దతు పలికి కనీసం లక్ష మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి ఆఖరి రోజైన మంగళవారం ఉదయం కిసాన్ నగర్‌లోని మైత్రి కన్వెన్షన్ నుండి బిజెపి శ్రేణులు మహా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ..మిగతా 2లో

## కౌశిక్ బ్లాక్ మెయిల్ రాజకీయాలు

### హుజురాబాద్ బీజేపీ అభ్యర్థి, మాజీమంత్రి ఈటల

**కరీంనగర్, నవంబర్ 28 (మనం న్యూస్):** బీఆర్ఎస్ నేతలు బ్లాక్ మెయిల్ చేస్తే ఓట్లు రావని హుజురాబాద్ బీజేపీ అభ్యర్థి, మాజీమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ...'నన్ను గెలిపించుకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని ఒకడు బ్లాక్ మెయిల్ చేస్తుండు. బ్లాక్ మెయిల్ చేస్తే ఓట్లు రావు బిడ్డా. ప్రశాంతంగా ఉన్న హుజూరాబాద్ గడ్డను బ్లాక్ మెయిల్‌కు వాడటం మంచిది కాదు. రాజకీయాలను ఇంతగా దిగజార్చడం చూస్తే బాధగా ఉంది. కేసీఆర్ రెండేళ్లు నన్ను రాసి రంపాన పెట్టాడు. కేసీఆర్‌ను బొంద పెట్టడమే అంతిమ లక్ష్యం అని ఈటల రాజేందర్ చెప్పారు.



## అంతా నిశ్శబ్దం..

- ప్రచార గడువు ముగిసింది..
- 48 గంటల పాటు మద్యం షాపుల బంద్
- బయటి నేతలంతా స్వస్థలాలకు..
- అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో ముగిసిన కీలక ఘట్టం

6

## మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి



- కేసీఆర్ పతనం మొదలైంది..
- కేసీఆర్ గెలిస్తే తెలంగాణ చస్తుంది
- ప్రజలు కాంగ్రెస్ చేయి పట్టుకోండి
- మంథనిలో శ్రీధర్ బాబును గెలిపించండి
- తెలంగాణా రాష్ట్రాన్ని సోనియా గాంధీకి బహుమతిగా ఇవ్వాలి
- సినీ నటీ, మాజీ ఎంపీ కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి

**మంథని, నవంబర్ 28 (మనం న్యూస్):** మంథని పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం విజయభేరి భారీ బహిరంగ సభకు సినీనటీ, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు విజయ శాంతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన విజయశాంతికి ..మిగతా 2లో

## పోలింగ్ రోజు కార్యాలయాలకు సెలవులు



- ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు విధిగా సెలవు ఇవ్వాలి
- ఆదేశాలు ఇచ్చిన ఎన్నికల అధికారి వికాస్ రాజు
- సెలవు ఇవ్వని సంస్థలపై చట్టప్రకారం చర్యలు
- నగరంలో అమల్లోకి వచ్చిన 144 సెక్షన్

2

## కామారెడ్డిని దేశం గమనిస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

గమనిస్తోందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి ప్రాంతంలో భూములను కొల్లగొట్టేందుకే కేసీఆర్ ఇక్కడ పోటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం మాటలు నమ్మి మోసపోవద్దని.. గొప్ప తీర్పును ఇవ్వాలని కోరారు. కామారెడ్డి ప్రజల తీర్పును దేశం నిశితంగా గమనిస్తోందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్లలో ప్రజలకు కేసీఆర్ చేసింది ఏమీ లేదని విమర్శించారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా వైశ్యులను కేసీఆర్ సర్కార్ మోసం చేసిందని ఆరోపించారు.ఈ క్రమంలోనే వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుందన్న ఆయన.. గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే.. వారి కుటుంబానికి రూ.10 లక్షలు, పిల్లల చదువుకు సాయపడేలా హస్తం పార్టీ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. కామారెడ్డి పట్టణంలో నిర్వహించిన ప్రచార ర్యాలీలో రేవంత్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బీడీ కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రేవంత్ పేర్కొన్నారు. కామారెడ్డి ప్రాంతంలో భూములను కొల్లగొట్టేందుకే కేసీఆర్ ఇక్కడ పోటీ చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఓటుకు రూ.పది వేలు ఇచ్చి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారన్న రేవంత్.. ఆదమరచి కేసీఆర్‌కు ఓటు వేస్తే రూ.కోట్ల విలువైన భూములను కొల్లగొడతాడన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కామారెడ్డిలో పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేసి అభివద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కామారెడ్డి ప్రజలు గొప్ప తీర్పును ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ అగ్రనేతలు రాష్ట్రంలో విస్తతంగా ప్రచారాల్లో పాల్గొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే 10 సభల్లో పాల్గొనగా.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 23 సభల్లో, ప్రియాంక గాంధీ 26 సభల్లో పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి 55 సభలకు హాజరు కాగా.. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ 10 సభల్లో పాల్గొని ప్రసంగించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య 3 సభల్లో, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ భగేల్ 4 సభల్లో పాల్గొని ప్రచారం చేశారు.

## రాష్ట్రపతికి కొత్త ఓటరు కార్డు

(మొదటిపేజీ తరువాయి)

ఒడిశాలోని మయూర్భంజ్ నివాసం అడ్రసు ఉంది. రాష్ట్రపతి తన ఓటరుకార్డులోని అడ్రసును ఢిల్లీకి మార్చుకోవడానికి వీలుగా ఢిల్లీ ఎన్నికల ప్రధానాధికారి ఈ నెల ప్రారంభంలో రాష్ట్రపతి భవన్ను సందర్శించారు.

## పోలింగ్ రోజు




## కార్యాలయాలకు సెలవులు

హైదరాబాద్, నవంబర్ 28 (మనం న్యూస్): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో అంటే.. నవంబర్ 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ఐటీ కంపెనీలు సెలవు ప్రకటించాలని ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాలు జారీ చేశారు. ఆయా కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని సంస్థలు సెలవు ఇవ్వాని ఆదేశించారు. సెలవు ఇవ్వని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ఎన్నికల వేళ కొన్ని సంస్థలు సెలవు ఇవ్వనట్లు తమకు ఫిర్యాదులు అందినట్లు సీఈవో తెలిపారు. ఈ మేరకు ఈ ఎన్నికలకు అన్ని సంస్థలు సెలవు ఇచ్చాయో లేదో పరిశీలించాలని కార్మిక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఎన్నికల దృష్ట్యా హైదరాబాద్ నగరంలోని అన్ని విద్యాసంస్థలకు రెండు రోజులు సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. బుధ, గురువారాల్లో జిల్లా పరిధిలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ 30వ తేదీన తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ రోజున అంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ సూచించారు. ఎన్నికలు జరిగే రోజున తెలంగాణలోని అన్ని ప్రైవేటు సంస్థలు, ఐటీ కంపెనీలు సెలవు ప్రకటించాలని సీఈవో వికాస్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆ కంపెనీలు హాలిడే ప్రకటించాలన్నారు. సెలవు ఇవ్వని సంస్థలు, కంపెనీలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తంలో జరిగిన ఎన్నికల్లో కొన్ని ఐటీ, ప్రైవేట్ కంపెనీలు సెలవు ఇవ్వలేదని తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, 2019 లోక్‌సభ ఎన్నికల రోజున సంస్థలు సెలవులు ఇవ్వకపోవడంతో ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నవంబర్ 30న ఎన్నికల రోజు అన్ని సంస్థలు హాలిడే ఇస్తున్నాయో లేదో పరిశీలించి, సెలవు ఇవ్వని కంపెనీ యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖకు తెలంగాణ సీఈవో వికాస్ రాజ్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నవంబరు 29, 30 తేదీల్లో పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. గరంలోని పలు విద్యాసంస్థల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నవంబరు 29న ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తరలించన్నారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలకు రెండు రోజుల పాటు సెలవు ప్రకటించారు. డిసెంబర్ 1న మళ్లీ స్కూళ్లు, కాలేజీలూ తెరచుకోనున్నాయి. తెలంగాణలో ఎన్నికల ప్రచారం ముగిసింది. హైదరాబాద్ నగరంలో 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని సీపీ సందీప్ శాండిల్యా తెలపారు. ఎన్నికల ముగిసే వరకు మద్యం దుకాణాలు బంద్ ఉంటాయని పేర్కొన్నారు. మూడు రోజుల పాటు మద్యం అమ్మకాలు నిలిపివేస్తూ హైదరాబాద్ సీపీ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ముగిసేవరకు 144 సెక్షన్ కొనసాగుతుందని సీపీ వెల్లడించారు. ఐదుగురికి మించి ఎక్కడైనా

# బీఆర్ఎస్‌కు ఓటేస్తే మళ్లీ దొరల సర్కార్



హైదరాబాద్, నవంబర్ 28 (మనం న్యూస్): ఎంఐఎం అభ్యర్థులు ఎక్కడ పోటీ చేయాలో భారతీయ జనతా పార్టీ నిర్ణయిస్తుందని.. బీజేపీ చెప్పిన చోటే ఎంఐఎం అభ్యర్థులు పోటీ చేస్తారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒకటే టీమ్ అని, వారంతా కలిసి పని చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బ తీయాలనే ఉద్దేశంతోనే 'పతంగి' పార్టీ పోటీ చేస్తుందన్న ఆయన.. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మళ్లీ దొరల సర్కార్ వస్తుందన్నారు. హస్తం పార్టీని గెలిపిస్తే ప్రజల సర్కార్ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందటం బీజేపీ విధానమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. బీజేపీ వ్యాప్తి చేసిన విద్వేషాన్ని భారత్ జోడో యాత్ర సమయంలో చూశానని తెలిపారు. భారతీయ జనతా పార్టీని ప్రశ్నించినందుకు తనపై 24 కేసులు పెట్టారన్న ఆయన.. దిల్లీలో ఎంపీల నివాసం నుంచి తనను వెళ్లగొట్టారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ఎంపీ నివాసం నుంచి తనను వెళ్లగొట్టినా బాధపడలేదని.. దేశ ప్రజలందరి గుండెల్లో తనకు ఇల్లు ఉందని బయటికి వచ్చానని అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలో నిర్వహించిన కాంగ్రెస్ కార్నర్ మీటింగ్ ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తనపై 24 కేసులు పెట్టిన బీజేపీ.. అవినీతిపరుడైన కేసీఆర్‌పై ఒక్క కేసు కూడా పెట్టలేదని రాహుల్ విమర్శించారు. మోదీ సర్కార్ తెచ్చిన అన్ని బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్లు అవినీతి జరిగిందని.. ఆ అవినీతి వల్లే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిందని ఆరోపించారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మళ్లీ దొరల సర్కార్ వస్తుందన్న ఆయన.. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజల సర్కార్ వస్తుందని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌కు మెట్రో రైలు ప్రాజెక్టు కేటాయించింది కాంగ్రెస్ ప్రభుత్వమని రాహుల్ తెలిపారు. హైదరాబాద్‌కు అంతర్జాతీయ విమానాశ్రయం ఇచ్చింది తమ పార్టీ అని.. ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు మంజూరు చేసింది హస్తం పార్టీ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారంలోకి వస్తే పేదల నుంచి కేసీఆర్ దోచుకున్న ప్రతి రూపాయి వసూలు చేసి మళ్లీ పేదల జేబులో వేస్తామని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్‌ను రూ.400కే ఇస్తామని.. రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇస్తామన్నారు. యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామన్న రాహుల్.. మహిళల ఖాతాల్లో ప్రతి నెలా రూ.2500 వేస్తామని చెప్పారు. మరోవైపు.. ఎంఐఎం అభ్యర్థులు ఎక్కడ పోటీ చేయాలో భారతీయ జనతా పార్టీ నిర్ణయిస్తుందని రాహుల్ ఆరోపించారు. బీజేపీ చెప్పిన చోటే ఎంఐఎం అభ్యర్థులు పోటీ చేస్తారని అన్నారు. కాంగ్రెస్‌ను దెబ్బ తీయాలనే ఉద్దేశంతోనే ఎంఐఎం పోటీ చేస్తుందన్న ఆయన.. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒకటే టీమ్ అని, అవన్నీ కలిసి పని చేస్తారని పేర్కొన్నారు. ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందటం బీజేపీ విధానం. బీజేపీ వ్యాప్తి చేసిన విద్వేషాన్ని భారత్ జోడో యాత్ర సమయంలో చూశాను. ఆ పార్టీని ప్రశ్నించినందుకు నాపై 24 కేసులు పెట్టారు. అవినీతిపరుడైన కేసీఆర్‌పై ఒక్క కేసు కూడా లేదు. ఎంఐఎం అభ్యర్థులు ఎక్కడ పోటీ చేయాలో బీజేపీ నిర్ణయిస్తుంది. కాంగ్రెస్‌ను దెబ్బ తీయాలనే ఉద్దేశంతోనే ఎంఐఎం పోటీ చేస్తుంది. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒకటే టీమ్. వారంతా కలిసి పని చేస్తారని అన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ తుఫాన్

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ తుఫాన్ రాబోతోందని రాహుల్ గాంధీ అన్నారు. మంగళవారం సాయంత్రం మల్కాజ్ గిరిలో జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలతో తమది రక్త సంబంధమని, కుటుంబ బంధమని చెప్పారు. ఇందిరాగాంధీ నుంచి తమ వరకు ఆత్మ సంబంధమని అన్నారు. కుట్రలు, హింస లేని భారత్ కోసం తాను భారత్ జోడో యాత్ర చేసినట్టు చెప్పారు. తనపై మోదీ ప్రభుత్వం 24 కేసులు పెట్టిందని, తనకు ఇచ్చిన క్వార్టర్ ను వాపస్ తీసుకుందని చెప్పారు. తెలంగాణలో ఇంత అవినీతి జరుగుతున్న కేసీఆర్ పై కేంద్ర ప్రభుత్వం ఎందుకు కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఈడీ, ఐటీ, సీబీఐ కేసులెందుకు పెట్టడం లేదన్నారు. మోదీ, కేసీఆర్ ఒక్కటేనని రాహుల్ పునరుద్ఘాటించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఎంఐఎం పోటీ చేస్తుంది కానీ, తెలంగాణలో చేయదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేసీఆర్ తిన్న అవినీతి సొమ్మును కక్కించి ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందని చెప్పారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్ఎస్ సర్కారులో నిరుద్యోగులకు కొలువు రాలేదన్నారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదని అన్నారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలే కథానాయకులై పోలింగ్ రోజు ముందు ఉండి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. చెల్లెలు ప్రియాంకతో కలసి ఆయన రోడ్‌షోలో పాల్గొన్నారు. పిసిసి చీఫ్ రేవంత్, మైనంపల్లిలు కూడా పాల్గొన్నారు.

# మీరే నా కుటుంబం

సిద్దిపేట, నవంబర్ 28 (మనం ప్రతినిధి): ప్రతి సందర్భంలో తనకు అండగా ఉంటూ అనుబంధాన్ని పంచుతూ మెజార్టీని పెంచుతూ వస్తున్న సిద్దిపేట ప్రజలకే నా జన్మంతా అంకితమని, మీ ప్రేమ, ఆదరాభిమానాలు వెల కట్టలేనివని రాష్ట్ర మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ అభ్యర్థి తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన మంగళవారం మధ్యాహ్నం సిద్దిపేటలో నిర్వహించిన రోడ్ షో ముగింపు కార్యక్రమంలో హరీష్‌రావు మాట్లాడారు. కేంద్రం అవార్డులిస్తే సిద్దిపేట లేనిదే ఏ అవార్డు రాలేదు. అవార్డులకు కేరాఫ్ అడ్రస్ సిద్దిపేటగా మారిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించుకున్నాం. తెలంగాణ సాధించుకున్నాక ఒకనాడు సిద్దిపేటలో ఎన్నికల సమయంలో గోడల మీద కనిపించే రాతలు, నినాదాలన్నీ నేడు నిజం చేసుకున్నాం. ప్రస్తుత ఎన్నికల్లో మరోమారు హ్యాట్రిక్ సర్కార్‌ను సాధించే క్రమంలో కేసీఆర్‌కు అండగా రాష్ట్రమంతా తిరిగేందుకు పంపించి ప్రతి ఒక్క కార్యకర్తే అభ్యర్థిగా పని చేస్తున్న మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలన్నారు. అభివృద్ధికి మారుపేరుగా, రోల్ మోడల్‌గా సిద్దిపేటను మార్చుకున్నామన్నారు. సముద్రాన్ని తలపించే జలాశయాలు, అద్భుత అభివృద్ధితో ప్రతిపక్షాలే ఈర్ష్య పడుతూ ఓర్వలేక విమర్శలు చేశాయని, సిద్దిపేట అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్షాలకు ఓటు అనే పోటుతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీటికి భరోసా ఇచ్చాం. మిషన్ భగీరథతో ఇంటింటికి తాగునీళ్లిచ్చాం. మీ అందరూ నా కుటుంబంగా పని చేస్తూ మీ గౌరవాన్ని పెంచుతున్నా. సాధారణంగా లీడర్లంటే ఎన్నికల సమయంలోనే ఓట్ల కోసం ప్రజల మధ్య ఉంటారు. కానీ నేను అలా కాకుండా రేపైతే ఎన్నికలైతే ఎలా పని చేస్తారో ప్రతి రోజు అలాగే పని చేస్తూ మీ అందరి సుఖ దుఃఖాల్లో ఉన్నానన్నారు. పోలింగ్ శాతాన్ని పెంచాలి, ప్రతి ఓటు కారు గుర్తుకే పడాలి.. కేసీఆర్‌కు మరింత బలాన్నివ్వాలన్నారు. కొనసాగుతున్న అభివృద్ధికి పట్టం కడుతూ భావితరాల అభ్యున్నతికి బాటలు వేయాలన్నారు. ఒక్కనాడు జై తెలంగాణ అనని, పదవుల కోసమే పాకులాడే రాజీనామా చేయని దొంగలంతా వచ్చారు.. వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కాంగ్రెస్ చేతుల్లో రాష్ట్రం పెడితే కుక్కలు చింపిన విస్తరే అవుతుందన్నారు. తల్లి చేతిలో బిడ్డ ఎంత క్షేమమో, కేసీఆర్ చేతిలో తెలంగాణ అంత పదిలమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజనర్సు, జెడ్పి ఛైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా ఛైర్మన్ మారెడ్డి రవిందర్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, నయ్యర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

### గుండె గులాబీల స్వాగతం


అభిమాన నేత హరీష్‌రావుకు సిద్దిపేట గులాబీదళం హారతి పట్టింది. గత ఎన్నికల్లో రికార్డు మెజార్టీ సాధించిన హరీష్‌రావుకు ఈ ఎన్నికల్లో లక్షన్నర మెజార్టీయే లక్ష్యంగా పని చేస్తున్న గులాబీ శ్రేణులంతా హరీష్‌రావు పట్ల తమ ప్రేమను, ఆత్మీయత, అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రచార బాధ్యతలు నిర్వహిస్తున్న హరీష్‌రావు ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన మంగళవారం నాడు సిద్దిపేటలో జరిగిన రోడ్ షోకు హాజరు కావడంతో ఎక్కడికక్కడ గులాబీ శ్రేణులు జయహో.. అంటూ హారతి పట్టారు. బాణాసంచాలు కాలుస్తూ పూల వర్షం కురిపిస్తూ, గజ మాలలతో సత్కరిస్తూ, తలపాగాలు చుడుతూ బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలుకుతూ అభిమాన నేత పట్ల ఆత్మీయతను పంచుకున్నారు. స్థానిక వేములవాడ కమాన్ వద్ద ప్రారంభమైన రోడ్ షో నర్సాపూర్ చౌరస్తా, లాల్ కమాన్, గాంధీ చౌక్, భారత్ నగర్ మీదుగా పాత బస్టాండ్ వరకు సాగింది. రోడ్ షోతో మంగళవారం పట్టణమంతా గులాబీ వర్ణాన్ని పులుముకుంది.

## ఒకే విడతలో దళితబంధు

(మొదటిపేజీ తరువాయి)

రెండుమార్లు ముఖ్యమంత్రిగా పని చేశా. పేదరికం పోవాలి.. వందశాతం అక్షరాస్యత సాధించాలి.. వైద్య సదుపాయాలు విరివిగా అందాలి... ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో నా మదిలో ఉన్నాయన్నారు. సమైక్య వాదులు మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుకోవాలని చూసినా మీ అందరి సహకారంతో రాష్ట్రాన్ని తీసుకువచ్చాం. మళ్లీ కాంగ్రెసోళ్ల చేతిలో పెడితే నష్టపోతామన్నారు. మాట మాట్లాడితే కాంగ్రెసోళ్లు ఇందిరమ్మ రాజ్యమంటున్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే మళ్లీ ఎమర్జెన్సీ చీకటి రోజులేనన్నారు. ఏది ఏమైనా గజ్వేల్‌తో పాటు రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసి ఈ రోజు తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుకరిస్తుంది.. అనే స్థాయికి కీర్తిని పెంచా... మరోసారి అవకాశం ఇవ్వండంటూ సీఎం కేసీఆర్ కోరారు. ఈ సభలో నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, యాదవరెడ్డి, మాదాసు శ్రీనివాస్, ఎలక్షన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఆపరేషన్ టన్నెల్ సక్సెస్

ఉత్తర కాశీ: ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 17 రోజుల నిరీక్షణకు ఎట్టకేలకు శుభం కార్డు పడింది. మొక్కవోని సంకల్పంతో వందలాది మంది అధికారులు, ఎన్డిఆర్ఎఫ్ సిబ్బంది, విదేశీ నిపుణులు అందరూ నిర్విరామంగా కొనసాగించిన కృషి ఫలించింది. ఇన్ని రోజులుగా టన్నెల్లోనే ఉన్న 41 మంది కార్మికులను మంగళవారం రాత్రి 9 గంటల తర్వాత క్షేమంగా ప్రాణాలతో బయటికి తీసుకు రాగలిగారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది చేసిన ప్రార్థనలు ఫలించి, ఎట్టకేలకు ఉత్తరకాశీ రెస్క్యూ ఆపరేషన్ విజయవంతమైంది. నిర్మాణ దశలో ఉన్న సొరంగం కూలడంతో 17 రోజులు పాటు భూగర్భ బందీలుగా బిక్కుబిక్కుమంటూ గడిపిన కార్మికులు ప్రాణాలతో బయటికి వచ్చారు. స్ట్రెచర్ సాయంతో ఒకరితర్వాత ఒకరిగా అందరినీ బయటికి తీసుకొచ్చారు. సొరంగంలోనుంచి బయటికి తీసుకువచ్చిన కూలీలను ఘటనా స్థలానికి దగ్గర్లో ఉన్న చిన్యాలీసౌర్ ఆస్పత్రికి తరలించారు. వారంతా క్షేమంగా ఆరోగ్యంగా ఉన్నారా లేదా అని పరీక్షించిన అనంతరం వారికి అవసరమైన చికిత్సను, వైద్య సలహాలను అందజేస్తారు. ఈ ఆపరేషన్లో భాగంగా రెస్క్యూ టీమ్ చేపట్టిన 'ర్యాట్హోల్ మైనింగ్' టెక్నిక్ ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి కారణమైంది. అత్యాధునిక మెషిన్లు ఆగర్ యంత్రాలు విఫలమైన చోట నిపుణుల సలహాతో చేపట్టిన ఈ 'ర్యాట్‌హోల్ మైనింగ్' అనుకున్న దానికన్నా వేగంగానే కార్మికుల వద్దకు చేరింది. డ్రిల్లింగ్ తర్వాత పైపింగ్ వేశారు. అనంతరం ఎన్డిఆర్ఎఫ్ సిబ్బంది పైపుద్వారా కార్మికులు ఉన్న చోటుకు చేరుకుని వారు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నారో పరిశీలించిన తర్వాత వారిని బయటికి తీసుకు వచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఒక్కో కార్మికుడిని ప్రత్యేకంగా తయారు చేసిన స్ట్రెచర్కు కట్టేసిన తర్వాత మనుషుల సాయంతో బయటికి లాగారు. ఒక్కో కార్మికుడిని బయటికి తీసుకు రావడానికి అయిదునుంచి ఏడు నిమిషాల సమయం పడుతుందని, మొత్త ప్రక్రియపూర్తి కావడానికి రెండు మూడు గంటలు పట్టవచ్చని అంతకు ముందు రెస్క్యూ అధికారులు చెప్పారు. కానీ మొత్తం ప్రక్రియ అనుకున్న దానికన్నా ముందే పూర్తయింది.

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి గత కొన్ని రోజులుగా ఘటనాస్థలి వద్దే ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తూ వచ్చారు.కార్మికులతోను, వారి కుటుంబ సభ్యులతోను మాట్లాడుతూ వారిలో ధైర్యం నింపుతూ వచ్చారు. కూలీలందరూ క్షేమంగా బయటపడాలని చేసిన ప్రార్థనలు ఫలించాయని కూలీలు బయటికి వచ్చిన అనంతరం విలేఖరులతో ధామి అన్నారు. మొట్టమొదటగా బయటికి తీసుకువచ్చిన కార్మికుడిని ధామిఆప్యాయంగా హత్తుకుని స్వాగతం పలికారు. కూలీలంతా క్షేమంగా బయటపడినందుకు వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి, ముఖ్యమంత్రి ధామికి, సహాయక బృంద సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ నెల 12న( దీపావళి రోజున) సొరంగంలో పనులు చేస్తుండగా అనూహ్యంగా చోటు చేసుకున్న ఘటనతో వారంతా సొరంగంలో చిక్కుకు పోయారు. తిరుగాడడానికి రెండు కిలోమీటర్ల మేర ప్రాంతం ఉండడం, బయటినుంచి తాగునీరు. ఆహారం, ఔషధాలు వంటివన్నీ అందుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయడంతో వారు క్షేమంగానే ఉన్నా పూర్తిగా బయటపడేంతవరకు కుటుంబ సభ్యులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. తమ వారిని చూడగానే వారంతా భావోద్వేగానికి గురయ్యారు. ఈ సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న వారిలో ఎక్కువ మంది జార్ఖండ్ వాసులే ఉన్నారు. మొత్తం 41 మంది కూలీల్లో 15 మంది జార్ఖండ్కు చెందిన వారు కాగా, ఏడుగురు యుపి, ఐదుగురు బీహార్, మరో ఐదుగురు ఒడిశా, ముగ్గురు పశ్చిమ బెంగాల్, ముగ్గురు ఉత్తరాఖండ్, ఇద్దరు అస్సాం, హిమాచల్‌ప్రదేశ్ నుంచి వచ్చిన ఒకరు ఉన్నారు.

## బండి సంజయ్ గెలిస్తే సీఎం అవుతారు

(మొదటిపేజీ తరువాయి)

ఎత్తున యువత తరలివచ్చి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మంద కృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ను గడగడలాడించిన బండి సంజయ్ సైన్యాధిపతిగా ముందుండి పోరాటాన్ని నడిపించారని కొనియాడారు. ప్రజల మనిషిగా ఉన్న బండి సంజయ్ ను గెలిపించుకోవాల్సిన బాధ్యత ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతోపాటు ఓసీ వర్గాలకు కూడా ఉందన్నారు. తెలంగాణలో 50 శాతానికి పైగా బిసిలు, 18 శాతం ఎస్సీలున్నారని, తెలంగాణలో ఇప్పటి వరకు బిసిలకు ముఖ్యమంత్రి అవకాశం రాలేదని, బిజెపి అందించిన ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆ పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించాలని పిలుపునిచ్చారు. గతంలో పాలించిన కాంగ్రెస్, టిడిపిలతో పాటు ఇప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని, అగ్రవర్ణాలే తప్ప బిసిలకు ముఖ్యమంత్రి అవకాశం రాలేదన్నారు. తాము ఎస్సీ వర్గకరణ కోసం 3 దశాబ్దాలుగా మేం పోరాటం చేస్తున్నామని, సమస్యను పరిష్కరించాల్సిన సమయంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ను, సోనియాగాంధీని, రాహుల్ గాంధీని కూడా కలిసి, వర్గీకరణ చేస్తామంటే వారితో వేదిక కూడా పంచుకున్నామని, కానీ వారు మొండి చేయి చూపించారని మంద కృష్ణ మాదిగ వ్యాఖ్యానించారు. తెలంగాణ తొలి సిఎం దళితున్ని చేస్తామని నమ్మించి మోసం చేసిన బిఆర్ఎస్‌ను ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

## మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి

(మొదటిపేజీ తరువాయి)



ఏఐసీసీ సెక్రెటరీ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీధర్ బాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గంలో అనేక విద్యాలయాలు స్థాపించి చదువుకోవడానికి అవకాశం కల్పించామని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మెడికల్ కాలేజీ, వ్యవసాయ డిగ్రీ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామని అన్నారు. విద్యుత్ కష్టాలు తీర్చింది కాంగ్రెస్ పార్టీ నేనని 2009లో 9 గంటల ఫ్రీ కరెంటు ఇచ్చి అనేక విద్యుత్ ప్లాంట్లు పెట్టామన్నారు. 24 గంటల విద్యుత్ ఇచ్చే సదుపాయం కల్పించింది కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. మంథని ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపితే చంపుతాం అంటూ దాడులు చేస్తున్నారని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ముంపుకు గురవుతున్న వారికి పంట నష్టం ఇస్తామని అలాగే కరకట్టలు నిర్మిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మాజి ఎంపీ కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి మాట్లాడుతూ.. అద్భుతమైన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో రూపొందించినదుద్దిళ్ళ శ్రీధర్ బాబును మంథని ఎమ్మెల్యేగా గెలిపించాలని విజయశాంతి ప్రజలను కోరారు. తెలంగాణా ప్రభుత్వంలో జరుగుతున్న హింసపై ఆమె మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌తో పంటలు, గ్రామాలు మునిగిపోయాయి, మెడిగడ్డ ప్రాజెక్ట్ కుంగి పోయింది ఆమె తెలిపారు. నిరుద్యోగులను కేసీఅర్ మోసం చేశాడని వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను గద్దె దించాలన్నారు. తెలంగాణలో మార్పు కావాలని కాంగ్రెస్ రావాలనీ ఆమె అన్నారు.ప్రకృతి కూడా సహకరించడం లేదనీ కెసిఆర్ పతనం మొదలైందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ప్రధాని మోడీ కెసిఆర్ కుటుంబం అవినీతి పాలన అన్నారని అమితాషా ఎవరు కెసిఆర్ కుటుంబంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కవిత లిక్కర్ స్కాం, అని తెలిసి మోడీ ఎందుకు వదిలేశారనీ ఈ సందర్భంగా ఆమె ప్రశ్నించారు. ఇద్దరిమధ్య తెరవెనుక ఒప్పందాల ఉన్నాయన్నారు. కేసీఆర్ గెలిస్తే తెలంగాణా చస్తుందని మీరు గెలిస్తే తెలంగాణా బ్రతుకుతుందని తెలంగాణా ప్రజలు కాంగ్రెస్ చేయి పట్టుకోండి ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలని సోనియా గాంధీకి తెలంగాణా రాష్ట్రాన్ని బహుమతిగా ఇవ్వాలని విజయశాంతి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు

- స్వేచ్ఛాయుతంగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఎన్నికలకు భద్రత ఏర్పాట్లు పూర్తి
- తెలంగాణ అసెంబ్లీ 2023 ఎన్నికల సందర్భంగా జగిత్యాల జిల్లా పరిధిలో 144 సెక్షన్ అమలు
- జిల్లా ఎస్పి సన్‌ప్రీత్‌సింగ్ ఐపిఎస్




జగిత్యాల ప్రతినిధి,నవంబర్28(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2023 సందర్భంగా నవంబర్30న ఎన్నికలు ఉన్నందున పోలీంగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు తేది నవంబర్ 28 తేది మంగళవారం సాయంత్రం 5 గంటల తరువాత నుంచి, డిసెంబర్ 1వ తేది శుక్రవారం ఉదయం 7 గంటల వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పి తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి జిల్లా కేంద్ర పోలీస్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, రూట్ మొబైల్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్, స్ట్రయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీంను ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియామవళిని పటిష్టంగా అమలు చేయడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జిల్లా పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గుంపులు గుంపులుగా తిరగోద్దని తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, గుర్తులు, ప్లకార్డులు ధరించవద్దని, ప్రదర్శించవద్దని తెలిపారు. మైకులు, లౌడ్ స్పీకర్లు వాడరాదని, రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, ఉపన్యాసాలు ఇవ్వకూడదని పేర్కొన్నరు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. ధర్నాలు, రాసారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటి కార్యక్రమాలను నేరంగా పరిగణించడంతో పాటు సదరు వ్యక్తులపై, ఎన్నికల సంఘం యొక్క నియమ నిబందనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, తేది 28 సాయంత్రం 5గంటల నుండి డిసెంబర్ 4 వ తేది ఉదయం 6 గంటల వరకు ప్రతి ఒక్కరు తూచ తప్పకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకోని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100 కి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు.

## అరవింద్ అభివృద్ధికి సహకరించడం లేదు



కోరుట్ల,నవంబర్ 28 (మనం న్యూస్) : నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కోరుట్ల పట్టణంలో ముంపు ప్రాంతాల అభివృద్ధికి సహకరించడం లేదని కోరుట్ల మాజి భారతీయ జనతాపార్టీ అధ్యక్షులు టివి శేకర్ ఆరోపించారు. ఆయన భారతీయ జనతాపార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి లేరని కార్యకర్తలను చిన్న చూపు చూస్తూ పార్టీ సిద్ధాంతాలను దొంగలు తోక్కుతున్నారని తెలిపారు. భాజపా జాతీయ అధ్యక్షుడు బండి సంజయ్ ఫోటో ను కూడా పార్టీకార్యాలయంలో ప్లెక్సీలపై ఏర్పాటు చేయకుండా ప్రయత్నిస్తున్నడని, తనకు తానే గోప్పగా ఊహించుకుంటున్నాడని ఆయన వల్ల పార్టీ నష్టపోతుందని భాజపా కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. అందువల్లే భాజపా పట్టణ అధ్యక్షుడిగా ఉన్నతను రాజీనామ చేశానని తన భార్య కూడా కౌన్సిలర్ పదవికి రాజీనామ చేసినట్లు అభివృద్ధి సంక్షేమమం కోసం భారసా లో చేరానని పేర్కొన్నారు.

## బడుగు బలహీన వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే..

- శ్రీదర్ బాబుతోనే మంథని అభివృద్ధి సాధ్యం
- పుట్ట మధు బీసీలకు చేసింది ఏమీ లేదూ
- అధికారంలోకి రాగానే కుల గణన చేస్తాం
- జాతీయ ఓబిసి సెల్ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ పి వినోద్ కుమార్,టిపిసిసి అధికార ప్రతినిధి కొనగల మహేష్




మంథని,నవంబర్28,(మనం న్యూస్): బిసి బిడ్డ అని చెప్పుకునే పుట్ట మధు బీసీల కోసం చేసింది ఏమీ లేదని పుట్ట మధు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎప్పుడు కూడా బీసీల సమస్యలపై మాటాడిన చరిత్ర లేదని ఓట్ల కోసమే బీసీ బహుజన వాదాన్ని పుట్ట మధు ఎత్తుకున్నాడని మంగళవారం జాతీయ ఓబిసి సెల్ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ పి వినోద్ కుమార్,టిపిసిసి అధికార ప్రతినిధి కొనగల మహేష్ లుమంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో బీసీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని కామారెడ్డి సభలో ప్రకటించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపడుతామని స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతం నుండి కు 42 శాతానికి పెంచుతామన్నారు.మంథని చరిత్ర గురించి దశాదిశలు తెలిసేలా పివి నరసింహారావు, దుద్దిల్ల శ్రీపాదరావు చేశారని, దుద్దిల్ల శ్రీధర్ బాబు మంత్రిగా ఉన్న సమయంలో మంథని నియోజక వర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని వారి పాలనలో మంథని ప్రశాంత వాతావరణం ఉండేదన్నారు.నేడు మంథని మినీ బీహార్ గా మారిందని మంథనిలో ప్రశాంత వాతావరణం నెలకొనాలన్న మంథని నియోజక వర్గం అన్ని విధాల అభివృద్ధి చెందాలన్నా మంథనియోజకవర్గం ప్రజలు చేతి గుర్తుకు ఓటు వేసి శ్రీధర్ బాబును మంథని ఎమ్మెల్యేగా గెలిపించాలని వారు కోరారు.విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శశిభూషణ్ కాచే,కొండ శంకర్,ఊదరి శంకర్,మూల పురుషోత్తం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మంథని అభివృద్ధికి పట్టం కడదాం

- పుట్ట మధుకర్‌ని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం
- తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ పెంట అజయ్




మంథని,నవంబర్28,(మనం న్యూస్) : పట్టణంలోని మంథని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ పెంట అజయ్ మాట్లాడుతూ..మంథని నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పుట్ట మధు ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.గత 40 సంవత్సరాల నుంచి మంథని నియోజక వర్గాన్ని ఒకే వర్గం పాలిస్తున్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.నియోజకవర్గంలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఎక్కడ లేని విధంగా అభివృద్ధి తెలంగాణలో ఉందన్నారు.హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం,విదేశీ విద్య కోసం 20 లక్షల రూపాయలు పేద విద్యార్థులకు ఇచ్చి విదేశాలకు పంపడం జరుగుతుందన్నారు.ఎన్నో సంక్షేమ పథకాలు బిఆర్ఎస్ పార్టీ తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బిఆర్ఎస్ పార్టీకే మళ్ళీ పట్టం కట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు సుంకరి పోతరాజు,తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్,తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గం ఇంచార్జ్ పెద్దపల్లి మధుకర్,ఆకుల శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే లెక్కలేసి కరెంట్ ఇస్తారు

- ఏది నిజమో ఏది అబద్దమో ప్రజలు ఆలోచన చేయాలి
- మీ బిడ్డగా ఆదరించి ఆశీర్వదిస్తే ఐదేండ్లు సేవ చేస్తా
- బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్

మంథని, నవంబర్28 (మనం న్యూస్) : ఆలోచన చేయకుండా కాంగ్రెస్‌కు ఓటేస్తే ఐదేండ్లు లెక్కలేసి కరెంటు ఇస్తారని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు.అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బాగంగా మంగళవారం మంథని మండలం లక్కేపూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగే ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయానికి 24గంటల కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్ వాళ్లు మాత్రం మూడు గంటల కరెంటు ఇస్తామని ప్రకటిస్తున్నారని అన్నారు.24గంటల కరెంటు కావాలో మూడు గంటల కరెంటు కావాలో రైతులు ఆలోచన చేయాలన్నారు.ఆనాడు రైతుల కరెంటు కష్టలు చూసిన సీఎం కేసీఆర్ గొప్పగా ఆలోచన చేసి 24గంటల కరెంటు,సాగునీరు, ఎరువులతో పాటు పెట్టబడి సాయం అందిస్తున్నారని ఆయన వివరించారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఎరువుల కోసం చెప్పులు లైన్‌లో పెట్టడం,కరెంటు కోసం సబ్‌స్టేషన్‌ల వద్ద ధర్నాలు చేసిన సంఘటనలు మర్చిపోవద్దన్నారు.కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ అవే పరిస్థితులు వస్తాయన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేండ్ల పాలన,పదేండ్ల ముందు కాంగ్రెస్ పాలనపై బేరీజు వేసుకోవాలని,తాను,కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పనితీరును ప్రజలు గమనించాలని అన్నారు.ఎన్నికలు వచ్చాయంటే నాయకులు అనేకం చెప్తుంటారని నిజాలేవి,అబద్దాలేమిటని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఈనాడు మనం వేసే ఓటు ఐదేండ్ల మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని ఆయన తెలిపారు.ఐదేండ్లలో అనేక మార్పులు వస్తాయని వాటిని గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం,సీఎం కేసీఆర్ పాలనలో కరెంటు కష్టాలు, మందుబస్తాల కోసం ఎదురుచూపులు,సాగునీటి తిప్పలు పోయాయని,రైతు ప్రభుత్వంలా ముందుకు సాగుతోందన్నారు.ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు పార్టీలు మారే విజయశాంతిని తీసుకువచ్చా రని, ఆమె ఏ పార్టీలో ఉంటుందో ఆమెకే తెలియని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్‌లో ఎవరు ముఖ్యమంత్రి అనేదాని పైనే స్పష్టత లేదని, అలాంటి కాంగ్రెస్‌ను ఆదరిస్తే ఆగమ్యగోచరమేనని అన్నారు. బీఆర్ఎస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను సీఎం కేసీఆర్ అద్భుతంగా తయారు చేశారని రైతుబీమా తరహాలో కేసీఆర్ భీమా ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తుందని, అదే విధంగా ప్రతి గృహినికి మూడు వేలు, పెట్టుబడి సాయం ,ఆసరా పించన్‌ల పెంపు జరుగుతుందన్నారు.ఈ పథకాలతో పాటుతాను పుట్ట లింగమ్మట్రస్టు ద్వారా సేవలు అందిస్తానన్నారు.ఇల్లు లేని నిరుపేద లకు గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు మంజూరీ చేయించి ప్రభుత్వం మూ డు లక్షలతో పాటు తాను కొంత సాయం చేసి దగ్గరుండి ఇళ్లు నిర్మించి ఇస్తానని అన్నారు.గ్రామాల్లో గృహలక్ష్మి పథకం ద్వారా నిర్మించి ప్రతి ఇంటిలో తన సాయం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అంతేకాకుం డా తోటగోపయ్యపల్లిని ప్రత్యేక గ్రామపం చాయతీగా ఏర్పాటు అయిందని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వచ్చే సర్పంచ్ ఎన్నికలు తోటగోపయ్యపల్లిలోనే జరుగుతాయని ఆయన తెలిపారు. నాలుగేండ్లలో ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధి,సేవలు మీ కళ్ల ముందే ఉన్నాయని, మళ్లీ ఆదరించి ఆశీర్వదిస్తే మీ కుటుంబసభ్యుడిలా ఐదేండ్లు సేవ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పుట్ట మధన్నను ఆదరించి ఆశీర్వదించండి

- ముత్తారం మండల కేంద్రం రూపురేఖలు మారుతాయి
- ముత్తారంలో భారీ ర్యాలీలో మాజీ సింగిల్ విండో డైరెక్టర్ నాగినేని జగదీశ్వరరావు

ముత్తారం,నవంబర్28, (మనం న్యూస్) : బిఆర్ఎస్ పార్టీ, ఆధ్వర్యంలో మంగళవారం, సింగిల్ విండో మాజీ డైరెక్టర్, నాగినేని జగదీశ్వరరావు, ఆధ్వర్యంలోభారీ ర్యాలీతో ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ మంథని ఎమ్మెల్యేగా పుట్ట మధూకర్ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ముత్తారం మండల కేంద్రంలోని వార్డులలో అభివృద్ధి జరిగిందన్నారు. ముత్తారం గ్రామ రూపురేఖలు మారాలంటే మదన్నను ఆశీర్వదించి గెలిపించాలన్నారు,అనేక సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందించామని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు గుర్తుచేశారు. తొమ్మిదేండ్ల కాలంలో పుట్ట మధూకర్ సహకారంతోనే ముత్తారం మండల కేంద్రంతో సహా అన్ని గ్రామాలలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పుట్ట మధుకర్ సహకారంతో మండలంలో నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి బాటలు వేశామన్నారు. తొమ్మిదేండ్ల సర్కార్ సీఎం కేసీఆర్ నాయకత్వంలో పుట్టమధూకర్ చొరవతో ముత్తారంలో బురదరోడ్లు లేకుండా సిమెంటు రోడ్లు వేయించామని డ్రైనేజీల నిర్మాణాలు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన అందించామని ఆయన చెప్పారు. నాలుగేండ్లు పుట్ట మధూకర్కు ఎమ్మెల్యే అవకాశం కల్పిస్తే ఒకవైపు అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు తనతల్లిపేరు మీద పుట్ట లింగమ్మ,ట్రస్టు ద్వారా అనేక సేవలు అందించారని, నాలుగేండ్ల అభివృద్ధి సేవలు మీ కళ్ల ముందే ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ఇక్కడ పాలించిన కాంగ్రెస్ పార్టీ నాయకుల హయాంలో ముత్తారం పరిస్థితి ఎలా ఉండేదో ఆలోచన చేయాలన్నారు. పని చేసే నాయకులు ఎవరో, పట్టించుకోని నాయకులు ఎవరో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన పథకాలు ప్రతి కుటుంబానికి మేలు చేసేలా ఉన్నాయని,ముఖ్యంగా గృహిణీలకు ఉపయోగపడుతాయన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే ప్రతి గృహిణికి ఇంటి అవసరాలకు మూడు వేలు, రూ.400లకే గ్యాస్సిలిండర్తో పాటు కేసీఆర్ భీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రభుత్వపథకాలతో పాటు ఎమ్మెల్యేగా పుట్ట మధూకర్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తారని ఆయన తెలిపారు పుట్ట మధూకర్ గెలుపుతోనే మనం బాగుపడుతామని రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి పుట్ట మధూకర్ను ఆదరించి ఆశీర్వదించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ముత్తారం ఉపసర్పంచ్ దేవునూరి సతీష్, సిరిమల్లె తిరుమలరావు ,రాగుల సతీష్ ,కాల్వ రమణారెడ్డి ,కాల్వ దేవేందర్ రెడ్డి ,మారం మల్లారెడ్డి, పింగిలి శ్రీనివాస్ రెడ్డి ,భేద సంపత్, తుటి లక్ష్మణ్ ,పింగిలి యుగంధర్ రెడ్డి, కుక్కడపు అశోక్, కుమార్, అమ్ము వినోద్ ,కుమార్ ,పేయ్యాల అంజి ,సూదాటి రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో గెలవడానికి ప్రజల ఆదరణ కావాలి

- మంచిర్యాలలో కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు
- రోడ్‌షో భారీగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు



మంచిర్యాల, నవంబర్ 28 (మనం న్యూస్) :ఎన్నికల్లో గెలవడానికి పైసలు పంచడం కాదని ప్రజల ఆదరణ కావాలని మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. తనను గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న ఆరు గ్యారంటీ పథకాలతో పాటు, నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రచారం చివరి రోజు మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన రోడ్ షో కార్యక్రమం సందర్భంగా ఆయన హామీలను ఇచ్చారు. తానూ గెలిచిన వంద రోజుల లోపల సమస్యలు అన్ని తీరుస్తా అని అన్నారు. ఎన్నికల్లో గెలిచినా తర్వాత కారు పట్టుకుని హైదరాబాద్ కు ఉరకడం కాదు ఇక్కడ ఉండి ప్రజలకు ఎలాంతో ఆపదలు వచ్చినా, ఎలాంటి సమయ వచ్చినా సేవలు చేయాలని, తానూ అదేవిధంగా మీకు అందుబాటులో ఉంది మీకు సేవలు చేస్తానని అన్నారు. ఇక్కడ ఇప్పుడు ఉన్న నాయకుడు పైసలకోసమే పనిచేసాడని, అక్కడ పైసలు ఇచ్చే బ్యాచ్ తప్ప ఎవరు లేరని బారాసను విమర్శించారు.హైదరాబాద్, లండన్ లాంటి ప్రాంతాల్లో కోట్లతో ఇండ్లు కొన్నాడని అన్ని కోట్లు ఎక్కడినుంచి వచ్చాయని అన్నారు.ఎన్నికల్లో పైసలు పంచడానికి భులు అమ్మితే కోట్లు వచ్చాయని , ఆ పైసలన్ని మేవే అని అన్నారు. 40 ఏండ్ల కిందట సైకిల్ మీద తిరిగిన ఈ పెద్ద మనిషికి ఇన్ని కోట్లు ఎక్కడినుంచి వచ్చాయని అన్నారు. ఎన్నికలకు కావలసింది పసులు కాదని ,చిత్తు కాగితాలు కాదని, ప్రజల గుండెల్లో ఉంటే చాలని, ప్రజల ప్రేమ, అభిమానా లు ఉంటె చా లని అన్నారు.తనకు హస్తం గుర్తు మీద ఓటు వేసి గెలిపించాలని కోరారు ఉదయం మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని పాత మంచిర్యాల నుంఛి రోడ్ షోను ప్రారంభించారు. అక్కడ నుంఛి మంచిర్యాల ఐ. బి చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, రైల్వే స్టేషన్ రోడ్‌శ్రీనివాస టాకీస్ ,ఓవర్ బ్రిడ్జి, తోళ్లవాగు వరకు అక్కడ నుంచి నస్పూర్ మున్సిపాలిటీ పరిదిలో సిసిసి కార్నర్ ,శ్రీరాంపూర్ బస్టాండ్, జీఎం ఆఫీసు వరకు ఈ రోడ్ షో కొనసాగింది. ఈ రోడ్ షో లో అయన సతీమణి , మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుకొక్కిరాలసురేఖ,ఇతరకాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మడిపల్లిలో ప్రణవ్‌కు మద్దతుగా భారీ ర్యాలీ

జమ్మికుంట,నవంబర్28(మనంన్యూస్):జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుల ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఒడితల ప్రణవ్ కు మద్దతుగా భారీ ర్యాలీనిర్వహించారు. ప్రణవ్ (చేతి) గుర్తుకు ఓటు వేయాలని నినాదాలు చేశారు. అదేవిధంగా ఇంటింటికి తిరుగుతూ హస్తంగుర్తుకు ఓటు వేసి ప్రణవ్ బాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు పొనగంటి మల్లయ్య సమక్షంలో పలువురు పలు పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ నాయకులు పొనగంటి మల్లయ్య కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉప్పుల సాంబశివరెడ్డి నేరెళ్ల సదానందం ఎగ్గెటి సదానందం మ్యాకమల్ల అశోక్ ఒగ్గు కుమారస్వామి అప్పాల రవీందర్ బండి కుమారస్వామి ఎగ్గేటి అయిలయ్య నాగపురి శ్రీనివాస్ కాంగ్రెస్ నాయ కులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బంది మూడవ దశ ర్యాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లి,నవంబర్28(మనంప్రతినిధి):జిల్లాలో జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మూడవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రానీ, సి.ఎన్.శ్రీధర, రిటర్నింగ్ అధికారులతో కలిసి ఆన్‌లైన్ ద్వారా పోలింగ్ సిబ్బంది మూడవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాటాడుతూ జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో 837పోలింగ్ కేంద్రాలున్నాయని, మూడవ దశ పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల వారిగా పోలింగ్ సిబ్బందిని కేటాయించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బంది కోసం అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని, పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రం వద్ద నవంబర్ 29 సైట్ స్టే ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ రోజు అనేక రకాల పుకార్లు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున, ప్రతి రిటర్నింగ్ అధికారి పరిధిలో ఇద్దరు సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి, ఫేక్ ప్రచారాల వ్యాప్తిని అరికట్టాలని అన్నారు. ఈర్యాండమైజేషన్ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ అధికారి జే.అరుణశ్రీ, పెద్దపల్లి, మంథని రిటర్నింగ్ అధికారులు సి.హెచ్. మధుమోహన్, హనుమానాయక్, కలెక్టరేట్ ఏ.ఓ.శ్రీనివాస్, ఈ.డి.ఎం.కవిత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గూటికి క్యూ కట్టిన బిఆర్ఎస్ నేతలు

- కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నల్ల శంకర్, అనుచరులు



మంచిర్యాల, నవంబర్ 28 (మనం న్యూస్ ):ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని బిఆర్ఎస్ సీనియర్ ముఖ్య నాయకులు ఒక్కొక్కరు కారు దిగి హస్తం గూటికి చేరుతున్నారు. ఇదివరకే మాజీ మున్సిపల్ చైర్మన్ వసుంధర తో పాటు ఆమె భర్త కౌన్సిలర్ కూడా ఇటీవల కాంగ్రెస్ పార్టీ లో చేరి కండువా కప్పుకున్నారు. తాజాగా మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నల్ల శంకర్, అతని అనుచరులు మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలపై నమ్మకంతో తాను కాంగ్రెస్‌లో చేరినట్లు, ప్రేమ్ సాగర్ రావు గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

## కేసిఆర్ ఆశీర్వాదం, బిఆర్ఎస్ పథకాలే నన్ను గెలిపిస్తాయి

- మంచిర్యాల బిఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్ రావు
- బిఆర్ఎస్ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ



మంచిర్యాల, నవంబర్ 28 (మనం న్యూస్ ):కెసిఆర్ ఆశీర్వాదం బిఆర్ఎస్ పథకాలే తనను గెలిపిస్తాయని మంచిర్యాల నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ధీమా వ్యక్తం చేశారు. ప్రచారం చివరి రోజైన మంగళవారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసిఆర్ నాయకత్వంలో ఈ పదేళ్ళ కాలంలో గత పాలకులు చేయని గొప్ప పనులు చేసిందన్నారు. ప్రజలంతా కేసిఆర్ వెంటే ఉన్నారని , ఆయన నాయకత్వాన్నే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, మంచిర్యాల ఎన్నికల ఇంచార్జీ భానుప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బి.వెంకట్రావు, నాయకులు గాదె సత్యం, సురేష్ బల్దా పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే తెలంగాణను ఇచ్చిన సోనియమ్మను గెలిపించినట్టే

- చెన్నూర్ సభలో తీన్మార్ మల్లన్న
- ఇక్కడ పోటీ కేసీఆర్‌కు వివేక్ వెంకటస్వామి మధ్యనే





మంచిర్యాల,నవంబర్28(మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలోను, ఇక్కడ చెన్నూర్ లో కాంగ్రెస్ పార్టీ గెలిపిస్తే, ఇక్కడ వివేక్ కు ఓటేస్తే మనకు తెలంగాణ వచ్చిన సోనియమ్మను గెలిపించినట్లే అని తీన్మార్ మల్లన్న అన్నారు. మంగళవారం ఆయన చెన్నూర్ లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి కి మద్దతుగా జరిగిన రోడ్డు షో మీటింగ్‌లో పాల్గొన్నారు. ఇక్కడ ప్రభుత్వాన్ని మార్చకపోతే కాంగ్రెస్ పార్టిని గెలిపించుకోకపోతే భారస నాయకులు చెబుతున్న ఆ బంద్, ఈ బంద్ అని ఆగిపోతాయని, ఇవన్ని కేసిఆర్ పెట్టిన ధోఖే బాజ్ పథకాలన్ని బంద్ అని, యువకులకు ఉద్యోగాలు రావని అన్నారు. తాను ఒంటరిగా ప్రజల్లో తిరుగుతానని బాల్క సుమన్, కేసిఆర్ పెట్టిన దోఖే బాజ్ పథకాలన్ని బంద్ అని, యువకులకు ఉద్యోగాలు రావని అన్నారు. తాను ఒంటరిగా ప్రజల్లో తిరుగుతానని బాల్క సుమన్, కేసిఆర్ లు గన్‌మెన్స్ లేకుండా తిరగగలరా, దుమ్ముంటే చెన్నూరులో తిరగమని అని అన్నారు. సార కారు ఓడిపోతున్నామని కేసిఆర్ కు అర్థం అయిందని అన్నారు. సిరిసిల్లాలో కేటిఆర్ గెలుస్తాడో లేదో డౌట్ అని, అదేవిధంగా సిద్దిపేటలో కూడా అల్లుడు హరిష్‌రావు పరిస్థితి తో పాటు కేసిఆర్ పోటి చేస్తున్న రెండు చోట్ల కూడా కాంగ్రెస్ గెలబోతున్నదని, మొత్తంగా చాల చోట్ల కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని ఓటర్లు సిద్ధం అయ్యారని అన్నారు. కాలువల్లో నీరు ఉంటే కరెంటుతో ఏమి పని, పంటలకు కావలసింది నీల్లే కదా మరి అని అన్నారు. ఆ చల్లని తల్లి ఇందిరమ్మ పథకాలు, సోనియమ్మ పథకాలు మన ముంగిట్లో కి వస్తాయని అన్నారు. ఇక్కడ వివేక్ వెంకటస్వామి గెలుపు ఖాయమని మిమ్మలిని చూస్తేనే అర్థం అవుతున్నదని అన్నారు. పదేండ్లు కేసిఆర్ ను బొంద పట్టాలని అన్నారు. మోడి, కేసిఆర్, ఇద్దరు ఒకటే అని, వారి మధ్య చీకటి ఒప్పందాలు ఉంటాయని, వారు చెప్పే మాటలు విని మోసపోవద్దని, హస్తం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని చెన్నూరు పరజలకు విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. డిసెంబర్ 30 నాడు బాల్క సుమన్ ను ఇక్కడ చిత్తు చిత్తుగా ఓడించాలని కోరారు. మనంతా చెయ్యి గుర్తుకు ఓటు వేస్తున్నామ కదా అని ఓటర్లను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నాణ్యమైన 24 గంటల కరెంటు మనకు వస్తుందని, అదే విధంగా ఇతర గ్యారెంటీల పతకాలు మనకు వస్తాయని అన్నారు. ఇంకా భారస నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని, వాళ్ల అన్నట్లుగా ఆగం ఆగం కావద్దని, మనకు ఈ దుష్ట పరిపాలన పోయి మంచి కాంగ్రెస్ రాజ్యంలో మంచి రోజులు రానున్నాయని అన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తన గెలుపు కోసం పెద్ద సంఖ్యలో కదలివచ్చిన వారందరికి పేరు పేరున నమస్కారం అన్నారు. కాళేశ్వరం కట్టి మేఘ క్రుష్ణారెడ్డి వద్ద కమీషన్ లు దోచుకున్న వ్యక్తి కేసిఆర్ అని అన్నారు. ఈ సభలో మాజి ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, అడ్వకేట్ శరత్‌కుమార్, ఓయు జేఏసి నాయకుడు యాదవ్, జిల్లా పరిషత్ మాజి వైస్ ప్రెసిడెంట్ మాల రాజిరెడ్డి, చెన్నూర్ పట్టణ అధ్యక్షుడు చెన్న నారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీపతి నరేష్ జన్మదిన వేడుకలు



జమ్మికుంట,నవంబర్28(మనంన్యూస్):తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం జమ్మికుంట మున్సిపాలిటి పరిధిలోని 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి నరేస్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి, నరేష్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజి ఎస్సి కార్పొరేషన్ చైర్మెన్ బండ శ్రీనివాస్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీంధర్ రావు, విద్యార్థ విభాగం రాష్ట్ర నాయకులు ఆవాల హరిబాబు, ఆవుల తిరుపతి యాదవ్, అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ప్రసాద్ ప్రతాప్, స్వాముల ఆధ్వర్యంలో సన్మానించారు. హౌజింగ్ బోర్డు కాలని చెందిన మహిళా సంఘం నాయకురాలు కాశిపాక నీల శివరాత్రి కవిత, సరోజన, పూసల రజిత, కనకం సంధ్య, అశ్విని, బత్తు భాగ్య, స్రవంతి, అశీన్, స్వరాజ్, ఎండి. సిరాజ్, ఖలీల్, సరోజన, పాత రాజేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు



మందమర్రి,నవంబర్28(మనంన్యూస్):మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ కమిటి ఆధ్వర్యంలో మంగళవారం మందమర్రి మార్కెట్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు కొండిల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు క్రుషి చేసాడని 1873 సెప్టెంబర్ 24న పూలే తన అనుచరులతో కలిసి దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందడానికి సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేశాడని, అణగారిని వర్గాల అభ్యున్నతికి కోసం పని చేసిన ఈ సంఘంలో అన్ని మతాలు, కులాలు ప్రజలు కూడా చేరవచ్చుని లాగ్రేంజ్‌లోని సామాజిక సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డాడని తెలిపారు. అతను, అతని భార్య సావిత్రిభాయి పూలే భారతదేశంలో మహిళావిద్యకు మార్గదర్శకులు, అతను మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందాడని, పూలే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణెలో ప్రారంభించారని అతను వితంతువుల కోసం ఒక గ్రుహాన్ని కూడా స్థాపించాడు భారత దేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి స్థానిక భారతీయులలో ఈ జంట ఉన్నారు. ఈకార్యక్రమంలో మందమర్రి పట్టణ ప్రధానకార్యదర్శి, తడికప్పుల రవి రాజా, సముద్రాల శ్రీనివాస్, సారయ్య, రామక్రుష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్‌ను విధుల నుండి తొలగించిన ఎన్నికల అధికారి

నస్పూర్, నవంబర్ 28 (మనం న్యూస్):ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఆశ వర్కర్ ను విధుల నుండి తొలగిస్తూ జిల్లా ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. నస్పూర్ మున్సిపాలిటి పరిధిలోని కృష్ణ కాలనీలో ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తోన్న ఎ.శ్యామల ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా జరిగిన ర్యాలీలో పాల్గొన్నట్లు ఫొటోలు రావడంతో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

- కేంద్ర ఎన్నికల డిప్యూటీ కమిషనర్ నితేష్ కుమార్ వ్యాస్



కొమురంభీం ఆసిఫాబాద్, నవంబర్ 28 (మనం న్యూస్):అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 30వ తేదీన జరగనున్న పోలింగ్ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కేంద్ర ఎన్నికల డిప్యూటీ కమిషనర్ నితేష్ కుమార్ వ్యాస్ అన్నారు. మంగళవారం ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న జరగనున్న పోలింగ్ కార్యక్రమం కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. కాయ జిల్లాలలో జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి బొర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సురేష్ కుమార్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు జరగనున్న సాధారణ ఎన్నికల కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల సిబ్బంది మూడవ విడత రాండమైజేషన్ కార్యక్రమాన్ని ఈరోజు పూర్తి చేయడం జరుగుతుందని, జిల్లాలో గుర్తించిన 92 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సి. సి. కెమెరాల ఏర్పాటు, సూక్ష్మ పరిశీలకుల నియామకం, ఆయా నియోజకవర్గాలలో విధులు కేటాయించబడిన అధికారుల తరలింపు ఇతరత్రా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ బందోబస్తు కొరకు 10 కంపెనీల సి.ఆర్.పి.ఎఫ్. దళాలు, హోంగార్డులు, స్థానిక పోలీసు అధికారుల సమన్వయంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో 294, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ కు అవసరమైన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వి వి ప్యాట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణ కొరకు ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర ప్రిసైడింగ్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులను నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారుల సమన్వయంతో పనిచేయడం జరుగుతుందని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి హేమంత్ సహదేవరావు



కొమురంభీం ఆసిఫాబాద్, నవంబర్ 28 (మనం న్యూస్):జిల్లాలో జరగనున్న అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, తమ ప్రచారం ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించాలని, ఓటర్లను మద్యం, నగదు, కానుకల పంపిణీ ద్వారా ప్రలోభాలకు గురి చేయకూడదన్నారు. పోలింగుకు 48 గంటల ముందుగా ప్రచార కార్యక్రమాలు నిలిపివేయాలని తెలిపారు. ఈ 28వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని, పోలింగ్ రోజున ఎన్నికల అధికారులకు సహకరించాలని తెలిపారు. ఇతర జిల్లాల నుండి ప్రచారానికి వచ్చినవారు జిల్లా వదిలి వెళ్ళిపోవాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు 48 గంటల వ్యవధిని ఖచ్చితంగా పాటించాలని, నిర్ణీత సమయానికి ప్రచారాన్ని ముగించాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీన జరగనున్న పోలింగ్ కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 001-సిర్పూర్ నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసి పూర్తి సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 001-సిర్పూర్, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో 92 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని తెలిపారు. జిల్లాలో 4,270 గుర్తింపు కార్డులను బూత్ స్థాయి అధికారుల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను దోచుకునేందుకే వీఆర్వోలను తొలగించారు

- కమీషన్ల కోసమే కాళేశ్వరం రీ డిజైనింగ్
- విద్య, వైద్యాన్ని బిఆర్ఎస్ నిర్వీర్యం చేసింది
- టిపిసిసి అధికార ప్రతినిధి దాసరి భూమయ్య



హుజురాబాద్ టౌన్, నవంబర్ 28 (మనం న్యూస్):ప్రభుత్వ భూములను దోచుకునేందుకే వీఆర్వోలపై లంచగొండులు అని నెపం మోపి ఉద్యోగాల నుంచి తొలగించారని పిసిసి అధికార ప్రతినిధి దాసరి భూమయ్య ఆరోపించారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని సంపదనంతా దోచుకుందన్నారు. అవినీతి ప్రభుత్వాన్ని బొంద పెట్టాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతులు ఇస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసిందని అన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వ పాఠశాలలను మూసివేసిందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన ప్రాజెక్టు లే నేటికీ ఉన్నాయని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు 38 వేల కోట్లతో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కమిషన్లు దండుకోవడానికి కేసీఆర్ సర్కార్ కాళేశ్వరం రీ డిజైనింగ్ చేసిందన్నారు. కెసిఆర్ కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, వారి కుటుంబంలో ప్రతి ఒక్కరికి ఫామ్ హౌస్ ఉందని అన్నారు. సంతోష్ రావుకు కోట్ల రూపాయలు ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముక్కెర రాజు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తిప్పారపు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కౌశిక్ రెడ్డిని గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ ప్రచారం



జమ్మికుంట, నవంబర్ 28 (మనం న్యూస్): బిఆర్ఎస్ అభ్యర్థి కౌశిక్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ తక్కెళ్లపల్లి రాజేశ్వర్‌రావు స్థానిక 21వ వార్డులో పట్టణ ఆర్యవైశ్యులతో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ, ప్రభుత్వ పథకాలను వివరించి కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అయిత మహేష్ ,బోల్లం చందు, శ్రవణ్ కుమార్,గర్రిపెల్లి అరుణ్, మంచాల లింగమూర్తి,అయిత రమేష్, సుదం శివ, గౌరిషెట్టి యుగేందర్, గౌరిశెట్టి రమేష్, యంసాని రమేష్ బాబు, అయిత నిఖిల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- రాజారాంపల్లిలో సెంట్రల్‌ఫోర్స్ ఫ్లాగ్ మార్చ్



వెల్గటూర్,నవంబర్28(మనం న్యూస్) : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎస్పి సంప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మంగళవారం స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి రవీంద్రకుమార్, బిఎస్ఎఫ్ డిఎస్పీ సురేష్, దీపాంకర్, సీఐ రమణ మూర్తి, ఎస్సెలు కొక్కుల శ్వేత, గొల్లపల్లి స్సె నరేష్ కుమార్, జిల్లా ఏఆర్, బిఎస్ఎఫ్, పోలీస్ సిబ్బంది ప్రజలతో కలిసి రాజారాంపల్లి గ్రామ పంచాయితి వద్దకు రాగా సర్పంచ్ గెల్లు శేఖర్ గ్రామస్థులు పూల దండాలతో స్వాగతం పలికారు. స్థానిక పిఎస్ఆర్ సర్కిల్ మీదుగా ర్యాలీగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తూ ఎండపల్లి మండల కేంద్రంకు రాగా సర్పంచ్ మారం జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పి, డిఎస్పి రవీంద్ర కుమార్ మాట్లాడుతూ నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పూర్తి స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లో పారామిలటరి దళాలతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవర్తన నియమావళి కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్, పోలీస్‌సిబ్బందిమహ్మద్ఆదిల్,మల్లేష్,లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి



మంచిర్యాల, నవంబర్ 28 (మనం న్యూస్) : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నవంబర్ 28న సాయంత్రం 5 గంటల తరువాత నుంచి, డిసెంబర్ 1వ తేదీ ఉదయం 7 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు.నవంబర్ 30న ఎన్నికలు ఉన్నందున పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరగాలన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పెద్దపల్లి, జోన్‌లలో ఐదుగురు, అంతకంటే ఎక్కువమంది గుంపులు గుంపులుగా తిరగొద్దని, రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, గుర్తులు, ప్లకార్డులు ధరించకూడదని, ప్రదర్శించవద్దని, మైకులు, లౌడ్ స్పీకర్లు వాడరాదని, రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు, ఉపన్యాసాలు ఇవ్వకూడదని పేర్కొన్నారు. అలాగే విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దని, ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటి కార్యక్రమాలను నేరంగా పరిగణించబడతాయని, సదరు వ్యక్తులపై ఎన్నికల సంఘం యొక్క నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిపి తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన టిఎన్జీవోల సంఘ నాయకులు

- ఎన్నికల సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని వినతి



కరీంనగర్, నవంబర్ 28 (మనం న్యూస్):ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతిని మంగళవారం టిఎన్జీవోల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఆయా పోలింగ్ కేంద్రాల్లో తగిన వసతులు కల్పించాలని కోరారు. పోలింగ్ ముగిసిన మరుసటి రోజు విధులు నిర్వహించిన సిబ్బందికి శుక్రవారం స్పెషల్ క్యాజువల్ లీవుగా ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేల సత్పతి మాట్లాడుతూ స్పెషల్ క్యాజువల్ లీవ్ కు సంబంధించిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌ను ఇప్పటి వరకు వినియోగించుకోలేని వారు వారికి సంబంధించిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన వసతుల గురించి కూడా తగు చర్యలు చేపడుతానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ ,జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ,కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, అసోసియేట్ అధ్యక్షులు రాగి శ్రీనివాస్, రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేష్, భరద్వాజ్ ,మహిళా జేఏసీ చైర్మన్ ఈరుమళ్ళ శారద, నాయకులు సబిత ,సునీత, రాజేశ్వరరావు ,కోండయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోట రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా రఘునాథ్ ఎన్నికల ప్రచారం

మంచిర్యాల, నవంబర్ 28 (మనం న్యూస్) :ఎన్నికల ప్రచారం చివరి రోజైన మంగళవారం నాడు బీజేపీ మంచిర్యాల అసెంబ్లీ అభ్యర్థి రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో మంచిర్యాల,నస్పూర్ పట్టణంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం, షిర్కే సెంటర్, రాయల్ టాకీస్ నుండి సీసీసీ కార్నర్ వరకు ఈ భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న కెసిఆర్ నిరంకుశ పాలనను అంత అందించాల్సిన సమయం వచ్చిందని మీ విలువైన ఓటుతో కెసిఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బిఆర్ఎస్ కు ఓటు వేసినట్టేనని కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు అందరూ కెసిఆర్‌కు అమ్ముడుపోతారన్నారు. మన మంచిర్యాలలో భూ కబ్జాలు, బెదిరింపులు పాల్పడే నాయకుడు వద్దని ప్రజల గురించి ఆలోచించే పాలన, పేద ప్రజల సంక్షేమం గురించి ఆలోచించే బిజెపిని గెలిపించాలని కోరారు. మంచిర్యాల పర్యటనలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా , బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు ఇన్ కమ్ టాక్స్ రద్దు చేస్తామని ప్రకటించారని, కార్మికుల పట్ల కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదని కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.

# అభివృద్ధి చేశా ఆశీర్వదించండి

- హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశా
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

గరిడేపల్లి/ నేరేడుచర్ల, నవంబర్ 28, మనం న్యూస్: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో చేసిన అభివద్ధి పనులే మళ్ళీ తనను గెలిపిస్తాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి, గరిడేపల్లి, కుతూబ్‌షాపురం, నేరేడుచర్ల మండలంలో ఇంజావారిగూడెం, కందులవారిగూడెం, రోళ్ళవారిగూడెం, నేరేడుచర్ల పట్టణంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ... జనం మధ్య ఉంటూ నియోజకవర్గ అభివద్దే లక్ష్యంగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందిస్తున్న తనను మళ్ళీ ఆశీర్వధించి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు



ఏ రాష్ట్రంలో కూడా లేవన్నారు. ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రచారం నిర్వహించిన ప్రతి గ్రామంలో, తండాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని డప్పుల చప్పుళ్ళతో కోలాటాలతో, మంగళహారతులతో ఘన స్వాగతం



పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్కమళ్ళ జ్యోతి, మున్సిపల్ చైర్మన్ చందమళ్ళ జయబాబు, పట్టణ అధ్యక్షులు కొణతం వెంకట్‌రెడ్డి, గరిడేపల్లి మండల అధ్యక్షులు కృష్ణనాయక్, ముఖ్యనాయకులు, కాసోజు శంకరమ్మ, ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ పార్టీనే

సూర్యాపేట నవంబర్ 28, మనం ప్రతినిధి: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనేనని ఆ పార్టీ జమ్ము కాశ్మీర్ రాష్ట్ర అధ్యక్షుడు, కర్నాటక ఎమ్మెల్యే కొనప్పరెడ్డిలు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత తొమ్మిదిన్నర ఏండ్లుగా ప్రజలు అవినీతి బిఆర్ఎస్ ప్రభుత్వం చేసే ఆకృత్యాలను చూస్తు ఒపికతో ఉన్నారని, ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని ఓడించి తీరుతారని అన్నారు. అక్రమాలు చేస్తు ఆస్తులను కూడబెట్టుకుంటు పేదల సంక్షేమాన్ని మరిచిపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు వివేకవంతులని సిఎం కేసిఆర్ చెప్పే బూటకపు మాటలను నమ్మే పరిస్థిలో లేరన్నారు. ఇంత కాలం అధికారంలో ఉండి ఎన్నికలు కావడంతో గ్యాస్ ధరను తగ్గిస్తామంటు హామి ఇవ్వడమేంటని ప్రశ్నించారు. అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్‌లను ఇవ్వలేదని అన్నారు. పథకాలు అన్ని ఆ పార్టీ నాయకులు, వారి బంధువులకు మాత్రమే చెందాయని అన్నారు. నియోజకవర్గంలో ఏ వాడకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి గెలుపు ఖాయమని చెబుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అబుబాకర్ సిద్ధిక్, జహీర్, తన్వీర్, సలీం, చకిలం రాజేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



పెన్‌పహాడ్ నవంబర్ 28, మనం న్యూస్: విద్యుత్ షాక్‌తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని లింగాల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మామిడి కృష్ణయ్య(38), అదే గ్రామానికి చెందిన గార్లపాటి మధుసుధన్‌రెడ్డికి చెందిన భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆ భూమిలో నారు పోశాడు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఉదయం నారుమడికి నీరుపెట్టేందుకు వెళ్లాడు. బోర్ మోటార్ ను వేసే సమయంలో వైరు తెగడంతో, దానిని కలిపేందుకు ప్రయత్నించే క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ సప్లై కావడంతో ప్రమాదవశాత్తు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతి చెందిన కృష్ణయ్యకు భార్య విజయలక్ష్మి, కూమారుడు, కూమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాధు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్సై వెంకటరత్నం తెలిపారు.

## ఘనంగా డోలోత్సవం

- ముగిసిన శ్రీ లక్ష్మీ నరసింహుని బ్రహ్మోత్సవాలు
- స్వామివారిని దర్శించుకున్న వేలాది భక్తులు



భీంగల్, నవంబర్ 28 (మనం న్యూస్): లింబాద్రిగుట్టపై జరుగుతున్న కార్తీక మాసం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహుని కార్తీకమాస బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. చివరి రోజు పుష్పయాగము ముగిసిన పిమ్మట ఉత్సవ ప్రారంభంలో ఆహ్వానితులైన సకల దేవతలకు మంత్రోచ్ఛరణచే ఉద్వాసన చేశారు. తదుపరి ధ్వజారోహణము చేసి ఉద్వాసన బలి, ఈశాన్య బలి నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నృసింహుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో తీసుకొచ్చి సమస్త భక్త జనుల మధ్య లాలి పాటలు పాడుతూ డోల సేవ నిర్వహించారు. డోల సేవతో ఉత్సవాలు ముగిసాయి. అనంతరం కొండపై నుండి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపుగా గుర్రపు సేవపై అలంకరించి పట్టణంలోని గ్రామాలయానికి మంగళ హారతులతో, డప్పు చప్పులతో, సన్నాయి వాయిద్యాలతో, ఎదుర్కోలుగా తెచ్చారు. గ్రామాలయంలో స్వామికి సప్తావరుణ పూజ నిర్వహించారు. ఉత్సవాలలో ప్రారంభం నుండి ముగింపు వరకు అధికారులకు పోలీసులకు, సేవకులకు అర్చకులు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ సిద్ధాంతాలు దోచుకోవడమే

- మల్లు లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి
- సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యురాలు బృంధాకారత్



హుజూర్‌నగర్, నవంబర్ 28, (మనం న్యూస్): హుజూర్‌నగర్ నియోజకవర్గ సీపీఎం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మిని గెలిపించాలని హుజూర్‌నగర్‌లో మంగళవారం రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షోలో ముఖ్యఅతిథిగా సీపీఎం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు బృంధాకారత్ పాల్గొని మాట్లాడుతూ..... ఎన్నికలు వచ్చాయంటే వానకాలంలో కప్పల్లా పూటకో పార్టీ మారుతున్నారని ఎర్రజెండా పట్టుకున్న కార్యకర్తలు నికార్సుగా ఉంటారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు 5సంవత్సరాలకు ఒక సారి వచ్చే ఎన్నికల్లో అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి గెలువాలని చూస్తున్నారన్నారు. ఇతర పార్టీల మాయాజాలాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎర్రజెండా సిద్ధాంతం కోసం పేదల కోసం పనిచేస్తుందన్నారు. పార్టీ పోటీ చేసింది వ్యక్తుల కోసం పార్టీ కోసం కాదని ప్రజల కోసమే పోటీ చేస్తున్నామన్నారు.. నిరంతరం ప్రజల పక్షాన ఎర్రజెండా పోరాడుతుందన్నారు. కాంగ్రెస్ ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సైదిరెడ్డి హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చేసింది ఏమిలేదన్నారు. ప్రజాస్వామ్యం, ధనస్వామ్యం, మధ్య జరుగుతున్న ఈ ఎన్నికలలో ప్రతి ఓటర్ ఆలోచించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికలలో మల్లు స్వరాజ్యం వారసురాలు మల్లు లక్ష్మి సీపీఎం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని ఆమెకు ఓటేసి గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి, సీపీఎం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగారపు పాండు, పారెపల్లి శేఖర్‌రావు, పల్లా వెంకట్‌రెడ్డి,దుగ్గి బ్రహ్మం, చిన్నం వీరమల్లు, శీలం శ్రీను, రేపాకుల మురళి, పాశం వెంకటనారాయణ,శీలం సాంభయ్య, పోషనబోయిన హుస్సేన్, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## ముగిసిన ప్రచార ఘట్టం

- పదిహేను రోజులుగా అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం
- గ్రామాలలో నిశబ్ధ వాతావరణం



తిరుమలగిరి నవంబర్ 28, మనం న్యూస్: 2023 ఎన్నికల ప్రచార హోరు మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు గత 15 రోజుల నుండి గ్రామాలలో మైకులు, ప్రచార రథాలతో విసృతంగా ప్రచారం నిర్వహించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మద్దిరాల, నూతనకల్, తుంగతుర్తి, నాగారం, తిరుమలగిరి, అర్వపల్లి, అడ్డగూడూర్, మోత్కూర్, శాలిగౌరారం మండలాలలోని 154 గ్రామాలలో ఎన్నిలక బరిలో నిలిచిన అభ్యర్థులు మైకులుపెట్టి ప్రచారాన్ని హోరేత్తించారు. తమ గుర్తులను చెబుతు ఆట పాటలతో ఇంటింటికి తిరుగుతు తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఒక్కసారిగా ప్రచారం ముగియడంతో పల్లెల్లో నిశబ్ధ వాతవరణం నెల కొంది.

# అభివృద్ధి సంక్షేమమే ఎజెండా



సూర్యాపేట, నవంబర్ 28, (మనం ప్రతినిధి): అభివృద్ధి పేదల సంక్షేమమే బిఆర్ఎస్ పార్టీ ఎజెండా అని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల చివరి రోజు ప్రచారంలో భాగంగా సూర్యాపేట మండల పరిధిలోని యండ్ల పల్లి, పిల్లలమర్రి, టేకుమట్ల, హనుమాన్ తండా, బీబిగుడెం, దురాజ్‌పల్లి, దాసాయిగుడెం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజల జీవితాలలో వెలుగులు వస్తాయని, అదే ఓటు కాంగ్రెస్‌కు వేస్తే చీకట్లు కమ్ముతాయన్నారు. 5 ఏండ్ల దామోదర్‌రెడ్డి పాలనలో సూర్యాపేట ఆగమైన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదని, ఆరు సార్లు అవకాశం ఇస్తే పని చేయనోడు ఇప్పుడు చేస్తాడా అని ఎద్దేవా చేశారు. అత్త కోడళ్ల మధ్య పంచాయితీ పెట్టిన పాపం హస్తం పార్టీదేనని, మూసి గేటుకు రంధ్రం పడి నీరు వృధాగా పోయి, పోలాలు ఎండి పోతుంటే కనీసం రిపేరు చేయించాలనే సోయి ఆనాడు దామోదర్‌రెడ్డికి లేదని, విమర్శించారు. 2014లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే మూసి గేట్లను రిపేరు చేసి వరుసగా 18 పంటలకు సాగు నీరు అందించామని అన్నారు. మూసిపై చెక్ డ్యామ్ నిర్మాణం, మత్స్యకారులకు వరంగా మారిందని అన్నారు. పేదల కడుపు చూసే నాయకుడు సిఎం కేసిఆర్ అని, కరెంట్‌తో రైతుల జీవితాలు కాంగ్రెస్ హయంలో ఆగమయ్యాయని గుర్తుచేశారు. పిల్లలమర్రి, ఉండ్రుగొండ, లింగమంతుల స్వామి గుట్టలు, మూసి ప్రాజెక్టల సమూహంతో పేటను టూరిస్టు హబ్‌గా తీర్చిదిద్దుతానని హమీ ఇచ్చారు. మూసి ప్రాజెక్ట్‌లో బోట్ హౌజ్‌లా నిర్మాణంతో నూతన శోభను తెచ్చి పర్యాటక కేంద్రంగా మార్చానని తెలిపారు. యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాబోయే పాలన ఉంటుందని అన్నారు. స్వచ్ఛమైన త్రాగునీరు, కడుపు నిండా తిండి, 24 గం. కరెంట్, సుందరమైన రహదారులు, ఇలా ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నేరవేర్చానని, మళ్లీ ఆశీర్వదిస్తే వెయ్యి ఎకరల్లో, డ్రైపోర్టు, ఇండస్ట్రీయల్ పార్క్, ఐటి హబ్‌లను విస్తరించి 20 వేలకు పైగా యువతి యువకులకు ఉపాధి కల్పిస్తానని తెలిపారు. మహిళలకు రూ.2000 పెన్షన్, కేసిఆర్ బీమా రూ. 5 లక్షలు, గ్యాస్ సిలిండర్ రూ. 400, రేషన్ ద్వారా సన్న బియ్యం, ఇల్లు లేని ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూమ్‌లు, ఆసర పెన్షన్ పెంపు, మహిళా సమాఖ్యలకు సొంత ఇంటి నిర్మాణాలు, అగ్రకులాల గురుకులాలతో పాటు రైతు బంధును రూ. 16వేలు చేసి వీటిని వంద శాతం అమలు చేస్తామని హామిఇచ్చారు.

### దమ్ముంటే కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమీషన్‌కు బాండ్ పేపర్ రాసి ఇవ్వాలి

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారేంటిలపై నమ్మకం లేక 42 పేజిలా గ్యారేంటిని తెరమీదకు తెచ్చారని, దానిని కూడా ప్రజలు నమ్మే పరిస్థిలో లేరని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రచారంలో భాగంగా విలేకరులతో మాట్లాడుతూ.. కర్నాటక రైతులకు బాండ్ పేపర్ రాసి ఇచ్చి పత్తాలేకుండా పోయిన చరిత్ర కాంగ్రెస్‌ది అని అన్నారు. తెలంగాణలో కూడా అదే తరహాలో పారిపోవడం ఖాయమని అన్నారు. కేసిఆర్ నోటి మాటే గ్యారేంటి అని తెలిపారు.

## మద్యం, డబ్బు ప్రలోభాలను అరికట్టాలి

- కరీంనగర్ బిఎస్పీ అభ్యర్థి నల్లాల శ్రీనివాస్



కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 28 (మనం న్యూస్) : కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులను చేపడుతోన్న మద్యం, డబ్బు పంపిణీని అరికట్టాలని కరీంనగర్ నియోజకవర్గ బిఎస్పీ అభ్యర్థి నల్లాల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఎన్నికల అధికారి ప్రత్యేక దృష్టి సారించి, అక్రమాలను అరికట్టాలని కోరారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతోన్న అభ్యర్థులకు తగిన బుద్ధి చెప్పేలా ఏనుగు గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బిఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగు సంపత్ గౌడ్ మాట్లాడుతూ మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న గంగుల కమలాకర్, ఎంపీగా ఉన్న బిజెపి అభ్యర్థి బండి సంజయ్‌లకు కరీంనగర్ అసెంబ్లీ ప్రజలను ఓట్లు అడిగే నైతిక విలువలేదని విమర్శించారు. వారిద్దరు ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కేవలం ప్రజలను మభ్య పెడుతూ ఓట్లు దండుకుని మాటలకే పరిమితమయ్యారన్నారు.


## ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు

చింతలపాలెం, నవంబర్ 28, (మనం న్యూస్): చింతలపాలెం మండల పరిధిలోని అడ్లూరు గ్రామ సర్పంచ్ కందుకూరి స్వాతి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలు కుటుంబాలు మంగళవారం ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ... వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని పార్టీలో చేరిన వారందరికి సముచితస్థానం కల్పిస్తానన్నారు. పార్టీలో చేరిన వారిలో చిలక నాగరాజు, కందుకూరి రాములు, కేతిపల్లి నగేష్, కొమ్ము కనకయ్య, కందుకూరి శ్రీను, వెంకటేశ్వర్లు ఉన్నారు.

## గంగులా... నా సహనాన్ని పరీక్షించకు

కరీంనగర్, నవంబర్ 28, (మనం బ్యూరో): గంగుల కమలాకర్.. ఒక్కటి గుర్తుంచుకో.. నా సహనాన్ని పరీక్షించకు.. నాపై దొంగ వీడియోలు సృష్టించి కుట్రలకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిసింది.. అంతగా దిగజారితే చరిత్ర హీనుడుగా మిగిలిపోతావ్.. నేను తలుచుకుంటే నువ్వు బయట తిరగలేవు.. అంటూ కరీంనగర్ బిజెపి అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన మంగళవారం కరీంనగర్ లో మహాబైక్ ర్యాలీ నిర్వహించారు. కనివినీ ఎరగని రీతిలో ఈ ర్యాలీకి ప్రజలు తరలివచ్చారు. కిసాన్ నగర్ లోని మైత్రి కన్వెన్షన్ నుండి ప్రారంభమైన మహా బైక్ ర్యాలీ, గాంధీ చౌక్, రాజీవ్ గాంధీ విగ్రహం, టవర్ సర్కిల్, శాస్త్రీ రోడ్, కమాన్, ఎన్టీఆర్ విగ్రహం, గణేష్ నగర్ బైపాస్, అంబేద్కర్ స్టేడియం, భగత్ సింగ్ విగ్రహం, గోదాం గడ్డ, ఉమెన్స్ కాలేజ్, రాంనగర్ మార్క్ ఫెడ్, మంకమ్మ తోట, హనుమాన్ టెంపుల్, శివ థియేటర్, కెమిస్ట్రీ భవన్, జగిత్యాల రోడ్, అంబేద్కర్ విగ్రహం మీదుగా రేకుర్తి వరకు కొనసాగింది. ఈ మహాబైక్ ర్యాలీ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద క్రిష్ణ మాదిగ ప్రారంభోపన్యాసం చేయగా, రేకుర్తి వద్ద ముగింపు సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. తన హీరోలైన కార్యకర్తలు, ప్రజల ఆశీర్వాదంతో కరీంనగర్‌లో భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కొట్లాడినం, నిరుద్యోగుల, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజల పక్షాన కొట్లాడినం.. అందుకే ప్రజలంతా బీజేపీ వైపు నిలబడ్డారన్నారు. ఇది తట్టుకోలేక గంగుల కమలాకర్ తనపై దొంగ వీడియో, ఆడియోలు సృష్టించి సర్క్యులేట్ చేసే పనిలో పడ్డారట.. నేను చెబుతున్న బండి సంజయ్ సంగతి నీకు తెలుసు.. కార్యకర్తల సత్తా నీకు తెలుసు.. నేను తలుచుకుంటే నీ వీడియోలు, నీ ఛాటింగ్‌లు ఇంటింటికీ చూపెడతానని హెచ్చరించారు. ఎల్లుండి పోలింగ్ సమయానికి కూడా అవి చూసిన కేసీఆర్, కేటీఆర్ లు నీకు ఫోన్ చేసి పోటీ నుండి తప్పుకోవాలని చెబుతారు.. అంతదాకా చేసుకోవద్దు నేను వీడియో, ఛాటింగ్ లు బయట పెడితే నీ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని బండి తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేగానీ నీ భూకబ్జాలు, రౌడీయిజం నా దగ్గర చెల్లవు, బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే నువ్వు తట్టుకోలేవన్నారు. ఒక్కసారి రాజకీయాలను పక్కనపెడితే ఒక్కొక్కరి అంతు చూసే దాకా వదిలిపెట్టను, అంతేతప్ప ఫ్రస్టేషన్ లో ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునే పరిస్థితే లేదని మండిపడ్డారు. ఫాంహౌస్‌లో పడుకున్న కేసీఆర్‌ను ధర్నా చౌక్‌కు గుంజుకొచ్చిన.అల్ప్రాల్ నువ్వెంత? ఖబడ్దార్ నీ దగ్గర కిరాయి పైసలు తీసుకుని పనిచేసే వాళ్లే ఉన్నరు.. కానీ నా దగ్గరున్నోళ్లంతా వీరులే.. పైసలతో పనిలేకుండా పార్టీ కోసం దేనికైనా తెగించేటోళ్లే హద్దు దాటితే తట్టుకోలేవ్.. మా జోలికొస్తే చరిత్ర హీనుడిగా మారిపోతావని వ్యాఖ్యానించారు. మీరు అధికారంలో ఉండేది మరో 48 గంటలే.. క్షణాలు, నిమిషాలు లెక్కించుకో 30న పోలింగ్ జరగబోతోందన్నారు. కరీంనగర్‌లో బీజేపీకే ఓటేయాలని ప్రజలంతా నిర్ణయించుకున్నారు. బిజెపి చరిత్ర సృష్టించబోతోందని, డిసెంబర్ 3న వెలువడే ఫలితాలతో మీ గుండె బద్దలు కాబోతోందని, ఇకపై మీ ఆటలు సాగబోవన్నారు. బీఆర్ఎస్ నేతలు విచ్చలవిడిగా డబ్బులు పంచే పనిలో పడ్డారని, కార్యకర్తలారా ఓట్లను పైసలతో బీఆర్ఎస్, కాంగ్రెసోళ్లు కొనాలనుకుంటున్నారు. మీ దృష్టికి రాగానే పోలీసులకు చెప్పండి.. వాళ్లు స్పందించకపోతే మీరే వాళ్ల దగ్గరున్న డబ్బులన్నీ గుంజుకోండి.. పేదలకు పంచి పెట్టండి.. అంటూ బండి పిలుపునిచ్చారు. ప్రజలారా ఒక్క క్షణం ఆలోచించండి భూకబ్జాదారులు, అవినీతిపరులు కావాలా?.... మచ్చలేని వ్యక్తిత్వంతో ప్రజల కోసం పోరాడుతున్న నేను కావాలా? ఆలోచించండి... కమలం పువ్వుపై ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలి అంటూ బండి విజ్ఞప్తి చేశారు. రాబోయే ఎన్నికల్లో కరీంనగర్‌లో ఎగిరేది బిజెపి జెండాయేనని, డిసెంబర్3న విజయోత్సవ ర్యాలీకి సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## అంతా నిశ్శబ్దం




మణుగూరు, నవంబర్ 28, (మనం న్యూస్) : మంగళ వారం సాయంత్రం 5 గంటలకు ప్రచార పర్వానికి తెర పడింది. వీధుల్లో మైకుల హోరు, ఇంటింటి ప్రచారం, పాటల సందడి ముగిసి పోయింది. ఈ నెల 30న ఎన్నికల సందర్భంగా పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందే ప్రచారం ముగించా ల్సిందే. ఇక ఓటర్లను ఎలాగైనా తమ వైపునకు మళ్లించుకు నేందుకు అన్ని పార్టీలు ఇప్పటికే తమ వంతు ప్రయత్నాలు చేశాయి. మిగిలిన సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయ కులంతా తమ స్వస్థలాలకు వెళ్లాల్సి ఉంటుంది. మంగళవారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది. అలాగే 48 గంటల పాటు మద్యం షాపులను సైతం మూసేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. మంగళవారం సాయంత్రం 5 నుంచే 30వ తేదీ సాయంత్రం 5 వరకు సైలెంట్ పీరియడ్లో టీవీ, సోషల్ మీడి యాలో ప్రకటనలకు అనుమతి లేదని, పత్రికల్లో వేసే ప్రకటనల కు ఎంసీఎంసీ (మోడల్ కోడ్ మీడియా కమిటీ) ముందస్తు అను మతి పొంది ఉండాలని ఎన్నికల అధికారులు వెల్లడించారు. 119 నియోజకవర్గాల్లో పోలింగ్ కోసం ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు. 8 జిల్లాల పరిధిలో 600కు పైగా పోలింగ్ కేంద్రాలను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి.అదనపు బలగాల ను మోహరించారు.

## దుబ్బాకలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మనోహర్‌రావు



మిరుదొడ్డి, నవంబర్ 28, మనం న్యూస్: దుబ్బాకలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు భూంపల్లి మనోహర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు తుమ్మల బాల్‌రాజు అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండల పరిధిలోని కాసులాబాద్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపి నాయకుల మాటలు ప్రజలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతులకు సాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని మండిపడ్డారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజలు ఆలోచించి నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బిక్షపతి, మైసయ్య, యాదగిరితోపాటు కాసులాబాద్ గ్రామ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలి

- డ్రోన్ కెమెరాతో పరిశీలించిన మిరుదొడ్డి పోలీసులు



మిరుదొడ్డి, నవంబర్ 28, మనం న్యూస్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని పోలీసులు సూచించారు. మంగళవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో డ్రోన్ కెమెరాల ద్వారా గ్రామ పరిసరాలను పర్యవేక్షించడం జరిగిందన్నారు. ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడైనా ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా ఓటర్లకు డబ్బులు, మద్యం, కిట్లు పంపిణీ చేసినట్లయితే డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల కమీషన్ నిఘా నేత్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## అబ్జర్వర్ల సమక్షంలో పోలింగ్ సిబ్బంది థర్డ్ ర్యాండమైజేషన్



నిజామాబాద్, నవంబర్ 28, (మనం న్యూస్): ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజెషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్.ఐ.సి హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ థర్డ్ ర్యాండమైజెషన్ ప్రక్రియ నిర్వహించారు. సాధారణ పరిశీలకులు ఎం.సుబ్రాచక్రవర్తి, ఐ.ఏ.ఎస్, లలిత్ నారాయణ్ సింగ్ సందు, ఐ.ఏ.ఎస్, గౌతమ్ సింగ్, ఐ.ఏ.ఎస్ లు ర్యాండమైజెషన్ ను నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిదిలో గల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలను ర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే పలు విడతలుగా ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలకుల దృష్టికి తెచ్చారు. జిల్లాలోని ఆరు సెగ్మెంట్ల పరిధిలో మొత్తం 1549 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం 7458 మందిని పోలింగ్ విధుల కోసం నియమించడం జరిగిందన్నారు. 20 శాతం రిజర్వు సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలను, ఒక దివ్యాంగుల బృందం, ఒక యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజెషన్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, సీపీఓ బాబూరావు, ఎన్ఐసి అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# పుట్టిన గడ్డకు సేవ చేయని సీఎం కేసీఆర్

- కొలువులు కాదు.. పబ్బు కావాలనేటోడు కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాకకు ఒంటికన్ను రాక్షసుడు హరీష్‌రావు
- దుబ్బాక ఎమ్మెల్యేగా మీకేం కావాలో నాకు తెలుసు
- ప్రశ్నిస్తే తప్పంటున్నారు బీఆర్ఎస్సోళ్లు
- 3వ నెంబర్‌పై గుద్దితే బిఆర్ఎస్‌కు బుద్ధి రావాలి
- దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు



దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 28, మనం న్యూస్: నాయకుడిగా ఎదిగిన వ్యక్తి పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలనుకువాలి కానీ పుట్టి పెరిగిన దుబ్బాక గడ్డకు మాత్రం ఎలాంటి సేవ చేయలేని, చేయని సీఎం ఎవరైనా ఉన్నారంటే అది కేవలం కేసీఆర్ మాత్రమే అని దుబ్బాక బీజేపి అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు ఆరోపించారు. కేసీఆర్‌కు సిద్దిపేట, సిరిసిల్లపై ఉన్న ప్రేమ దుబ్బాక ప్రజలపై మాటల్లో తప్ప చేతల్లో లేదని ఆయన ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన మంగళవారంనాడు నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాక, నియోజకవర్గ పరిధిలోని చేగుంట, నార్సింగి మండలాల్లో భారీ ఎత్తున బీజేపి శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశాల్లో రఘునందన్‌రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకుల తీరుపై మండిపడ్డారు. కేసీఆర్ 70 వేల పుస్తకాలు చదివినప్పటికీ పుట్టిన గడ్డకు సేవ చేయాలనే ఆలోచన రాకపోవడం విడ్డూరంగా ఉందని, మరి తాను అన్ని పుస్తకాలు చదివిండో లేదో ఆయనకే తెలవాలని విమర్శించారు. దుబ్బాక ప్రజలపై నిజంగానే ప్రేమ ఉంటే దుబ్బాక వాసులు పోగేసి నిర్మించుకున్న బాలాజీ దేవాలయ ప్రారంభోత్సవానికి, పట్టణంలో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవానికి, డబుల్ బెడ్ రూమ్‌లు అందించేందుకు, వంద పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. దుబ్బాక ప్రజలకు నిజంగానే తాను సేవ చేసి ఉంటే ఎప్పుడో వచ్చి తానే చేసే వాడని, కానీ తానేమీ చేయలేదని తనకు తెలుసని, దుబ్బాక నిధులు సైతం సిద్దిపేటకు తరలించిన విషయాన్ని ఎక్కడ ప్రజలు ప్రశ్నిస్తారో అన్న భయంతోనే పదేళ్ల పాటు దుబ్బాకకు రాలేదని మండిపడ్డారు. అంతేకాకుండా దుబ్బాక నియోజకవర్గ యువత కోసం దుబ్బాకలో అన్ని హంగులతో కూడిన లైబ్రరీ ఏర్పాటు చేస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా నేటికీ లైబ్రరీ రాలేదు కానీ రెండు వైన్స్ షాపులు పెరిగినయ్, ఒక బార్ కూడా వచ్చిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు రాష్ట్రంలో మద్యం విక్రయాలపై ఉన్న శ్రద్ధ విద్యపై, యువతకు ఉపాధి కల్పనపై లేదన్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డికి దుబ్బాక అభివృద్ధి పట్టదు, కొలువులు కల్పించే ఆలోచన లేదు కానీ మంత్రి హరీష్‌రావును యువత కోసం పబ్బు కావాలని అడగడం సిగ్గుచేటన్నారు. ఇంతటి సంస్కారవంతులు బిఆర్ఎస్ నాయకులని, మరి దుబ్బాక ప్రజలే వారికి కొలువులిచ్చే వారు కావాలో, లేక పబ్బు కావాలనేటోడు కావాలో తేల్చుకోవాలన్నారు. అదేవిధంగా నాడు ఆంధ్రా ఒక కన్ను, తెలంగాణ ఒక కన్ను అన్నోన్ని తరిమేశామని, నేడు సిద్దిపేట ఒక కన్ను, దుబ్బాక ఒక కన్ను అనేటోన్ని కూడా అదే రకంగా తరిమేయాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. మంత్రి హరీష్‌రావు దుబ్బాకకు పట్టిన ఒంటికన్ను రాక్షసుడని, నాడు రామలింగారెడ్డి హయాంలో దుబ్బాకకు మంజూరైన పాలిటెక్నిక్ కళాశాలను సైతం సిద్దిపేటకు గద్దలా తన్నుకెళ్లిన రాక్షసుడు అని వ్యంగ్యంగా విమర్శించారు. నియోజకవర్గానికి వచ్చిన కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు తనను తిట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, తానంటే ఎందుకంత కోపమో అర్థం కావడం లేదన్నారు. దుబ్బాక ప్రజల కోసం డబుల్ బెడ్‌రూమ్‌లు అడిగినందుకా, వంద పడకల ఆసుపత్రి అడిగినందుకా, కొలువులు అడిగినందుకా, రేషన్ కార్డులు అడిగినందుకా లేక లైబ్రరీ కావాలని అడిగినందుకా, రోడ్లు కావాలని అడిగినందుకా అని ఆయన ప్రశ్నించారు. ఎవరెన్ని అన్నా, ఏమీ చేసినా నేను దుబ్బాక బిడ్డనే అని, నా చివరి శ్వాస దాకా దుబ్బాక నియోజకవర్గ ప్రజల కోసమే పోరాడుతానన్నారు. దుబ్బాక ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలకు ఏం కావాలో నాకు తెలుసని, రోడ్లు, లైట్లు, దుబ్బాకకు రింగు రోడ్డు వంటివి అన్నింటినీ చేయిస్తానని, ఎప్పుడో పూర్తయిన రింగురోడ్డు సర్వేను మళ్లీ కేసీఆర్ చేయిస్తానని చెప్పడం తన అవివేకమని, అయినప్పటికీ ఎందుకు రింగురోడ్డు మంజూరు చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. ఎన్నికలు సమీపించగానే దుబ్బాక బిఆర్ఎస్ నాయకులు డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద, కాలనీల్లో వీధుల వద్ద వద్ద ప్రజలపై, పిల్లలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని, వారి బెదిరింపులకు, కేసీఆర్ తాటాకు చప్పుళ్లకు ఇక్కడ భయపడే వారెవరూ లేరనే విషయం గమనించాలని, దుబ్బాక ప్రజల తరుపున వారికి కావాల్సినవన్నీ అడిగేందుకు తానున్నానన్నారు. ప్రజలకు కావాల్సినవి అడిగితే బిఆర్ఎస్ నాయకులు తప్పంటున్నారని, దీనిపై దుబ్బాక ప్రజలు వారికి ఈ ఎన్నికల్లో మరోసారి కర్రు కాల్చి వాతపెట్టాలన్నారు. దుబ్బాక నియోజకవర్గ యువత కోసం వారు ఇబ్బందులకు గురి కావద్దని ఉచితంగా టెట్, ఎస్ఐ, కానిస్టేబుల్ కోచింగ్, వంద కంపెనీలలో సుమారు 1700 మందికి ఉద్యోగ కల్పన వంటివి కల్పించానని ఇవన్నీ బిఆర్ఎస్ నాయకులకు కనిపించడం లేవన్నారు. గత ఉప ఎన్నికల్లోనే హరీష్‌రావుకు కర్రుకాల్చి వాత పెట్టినా బుద్ధి రాలేదని, ఈసారి దుబ్బాక నియోజకవర్గ ప్రజలంతా 3వ నెంబర్ కమలం పువ్వుపై ఓట్లు గుద్దితే కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులకు దిమ్మ తిరిగి బొమ్మ కనబడాలన్నారు. కావున దుబ్బాక ప్రజలకు అండగా తానున్నాని, మీ బిడ్డగా తనను ఆశీర్వదించి కమలం పవ్వు గుర్తుపై ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించి పేద ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా మరోసారి అసెంబ్లీకి పంపాలని ఆయన కోరారు.



## వైభవంగా సాగిన కార్తీక పౌర్ణమి వేడుకలు

- బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ్ శర్మ ఆధ్వర్యంలో మహదేవుడికి అభిషేకం





దౌల్తాబాద్, నవంబర్ 28, మనం న్యూస్: కార్తీక పౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని శ్రీ గురుదత్త పీఠం శ్రీ చాముండేశ్వరీ శ్రీ కొడకండ్ల శ్రీరాం చరణ్‌శర్మ ఆధ్వర్యంలో దొమ్మాట గాజులపల్లిలోని కైలాసపురంలో నిర్మితమవుతున్న దక్షిణ కాశీ శ్రీ మహాకైలాసేశ్వర ఆలయ ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చరణ్ శర్మ మాట్లాడుతూ పురాతన, ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన ఈ ప్రాంతంలో వందల ఏళ్లనాటి శివాలయం జీర్ణోద్ధరణ చేయాలన్న దైవ సంకల్పంతో ఇక్కడ బృహత్తర ఆలయానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. నాటి నుండే బాలాలయాన్ని స్థాపించి నిత్య పూజలు, అభిషేకాల కోసం భక్తులకు అందుబాటులో ఉంచడం జరిగిందని, రాబోయే రోజుల్లో కైలాసపురం మహాక్షేత్రంగా పరిఢవిల్లబోతుందన్నారు. ప్రస్తుత కార్తీకమాసాన్ని పురస్కరించుకొని సోమవారం పౌర్ణమి వేడుకల సందర్భంగా కోటి దీపారాధనలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని దీపారాధన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారన్నారు. మహదేవునికి మహారుద్రాభిషేకం, కోటి దీప ప్రజ్వలన, జ్వాలాతోరణం, పల్లకి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకు శ్రీ చాముండేశ్వరీ గురుదత్తపీఠం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసి వచ్చే భక్తులకు అన్నదానంతోపాటు అన్ని సౌకర్యాలు చేసినట్లు తెలిపారు. ప్రతి సోమవారం దొమ్మాట గాజులపల్లి మధ్యన కైలాసపురంలో మహదేవునికి అభిషేకం జరుగుతుందని, ఇందుకు భక్తులు భారీగా తరలివచ్చి మహదేవున్ని దర్శించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజిత వెంకటరెడ్డి, అప్పవారి శ్రీనివాస్, చాముండేశ్వరి గురుదత్త పీఠం స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలి

- ఓట్లను కోరుతూ వచ్చే ఎస్ఎంఎస్‌లపై ఫిర్యాదు చేయండి
- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 28, (మనం న్యూస్): ప్రజలందరు తప్పకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి విజ్ఞప్తి చేశారు. రాబోయే ఐదు సంవత్సరాల భవిష్యత్‌ను నిర్ణయించే ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని సూచించారు. 28వ తేదీ నుంచి 30 వరకు 48 గంటల పాటు ఓటేయాలని కోరుతూ వచ్చే మెసేజ్‌లపై 90301 72072 ఫోన్ నెంబరుకు ఫిర్యాదు చేయాలని, అలాంటి ఫిర్యాదులపై ఐపిసి, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుండి 30వ తేదీ పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పిరియడ్ ను పాటించాల్సి ఉంటుందని చెప్పారు. అదే విధంగా డ్రై డేకు సంబంధించి జిల్లాలోని మద్యం షాపులను మూసివేసినట్లు తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను మరింత పకడ్బందీగా చేయడంలో భాగంగా జిల్లాలోని ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలను బలోపేతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంల ద్వారా మరింత పకడ్బందీగా పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 1338 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 289 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. తొమ్మిది వందల పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ను, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. జిల్లాకు వచ్చిన ఎపిక్ కార్డులన్నింటిని ఇప్పటికే అందజేసినట్లు, సోమవారం జిల్లాకు వచ్చిన మరో 6వేల700 ఎపిక్ కార్డుల పంపిణి కొనసాగుతున్నట్లు తెలిపారు. 96 శాతం ఓటర్ ఇన్ఫర్మెషన్ స్లిప్పులను బిఎల్‌ఓల ద్వారా ప్రతి ఇంటికి పంపిణి చేసినట్లు, ఓటర్ ఇన్ ఫర్మేషన్ స్లిప్పుల పంపిణి ద్వారా బదిలి, చనిపోయిన ఓటర్లను గుర్తించడం జరుగుతుందని, 1.93శాతం బదిలి, చనిపోయిన ఓటర్లను జిల్లాలో గుర్తించినట్లు వివరించారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను మంగళవారం సాయంత్రం నుండి కఠినంగా అమలు చేస్తున్నట్లు, అందులో భాగంగా మంగళవారం సాయంత్రం 5 గంటల నుండి టెలివిజన్ ద్వారా గాని, సంక్షిప్త సందేశాలు, వాయిస్ రికార్డెడ్ ఫోన్ కాల్స్, వాహనాలు, లౌడ్ స్పీకర్, క్యాంపేన్ లు జరగరాదని వాటికి అనుమతులు కూడా ఇవ్వడం జరగదని పేర్కొన్నారు. మద్యం అమ్మకాలు, రవాణ జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాలలో ఓటుహక్కు లేని రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎవరు ఉండకూడదని, మీడియా ద్వారా ఎటువంటి ఒపినీయన్ పోల్స్ నిర్వహించడం, ప్రచారం చేయడం వంటివి చేయకూడదని పమేలా సత్పతి సూచించారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల లోపల పోలింగ్ సంబంధించిన పనులు మాత్రమే జరగాలని, ఎలాంటి రాజకీయ ప్రచారానికి సంబందించిన కార్యక్రమాలను నిర్వహించరాదని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటుకు సంబంధించిన వివరాలను తెలుసుకోడానికి ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు, ఓటరు సమాచారం స్లిప్ ఓటరుకు అవగాహన కల్పించడానికి మాత్రమే పనిచేస్తుందని, ఎపిక్ కార్డు కాకుండా 12రకాల ఓరిజినల్ ఫోటో గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి ఓటరు పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికలప్రవర్తన నియావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులపై చర్యలుతీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో అంకిత భావంతో స్వీప్ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా 25వేల కొత్త ఓటర్లను నమోదు చేసినట్లు, కళాశాలలో నిర్వహించిన స్వీప్ కార్యక్రమాల ద్వారా 5507 మొదటి సారి ఓటుహక్కను కల్పించినట్లు ఆమె వివరించారు. 21 సంవత్సరాలు నుండి 28 సంవత్సరాలు గల 11వేల200 మంది యువ ఓటర్లును గుర్తించి వారందరికి ఎపిక్ కార్డులను అందజేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో హోం ఓటింగ్ 12డి ఫారాలను సమర్పించిన 1195 మంది దివ్యాంగులు, వయోవృద్ధుల ఇళ్లవద్దకే వెళ్లి హోం ఓటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు బుధవారం వరకు అవకాశం కల్పించినట్లు ఇంకా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా జిల్లాలో 5వేల700 మంది పోస్టల్ బ్యాలెట్ ను వినియోగించుకోగా, అందులో 5వేల400 మంది మన జిల్లాలకు చెందిన వారని, ఇక్కడ పనిచేస్తూ, మరో జిల్లాలో ఓటుహకు కలిగి ఉన్న 1200 మందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కల్పించడం జరిగిందని తెలిపారు. ఫామ్ 12 సమర్పించక పోవడం, ఎలక్షన్ డ్యూటి ఆర్డర్ జతచేయకపోవడం, బయటి జిల్లా ఆర్వోల నుండి ఫారం ఇక్కడకు చేరుకోకపోవడం వంటి కారణాల ద్వారా పోస్టల్ బ్యాలెట్‌లో కొంత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని

## ఆశీర్వదించి గెలిపిస్తే అన్నింటా అభివృద్ధి చేస్తా

- హామీలను తుంగలో తొక్కిన బీఆర్ఎస్, బీజేపి నాయకులు
- కాంగ్రెస్ పార్టీతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం
- దుబ్బాక అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



మిరుదొడ్డి, నవంబర్ 28, మనం న్యూస్: తనను ఆశీర్వదించి తన ను గెలిపించినట్లయితే దుబ్బాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృ ద్ధిపరుస్తానని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి, అక్బ ర్‌పేట గ్రామాలతోపాటు ఆయా గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నేత చెరుకు ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి తప్పితే దుబ్బాక నియోజకవర్గంలో బిఆర్ఎస్, బీజేపి పార్టీల నాయకులు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. బిఆర్ఎస్, బీజే పి పార్టీల నాయకులు ఎన్నికల ముందు ఉచిత హామీలిచ్చి ఎన్నికల తర్వాత ఆ హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేయడం జరుగు తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకం, రైతురు ణమాఫీ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ పూర్తిగా అవినీతిమయంలో కూరుకుపోయిందని, బీజేపి ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచి ప్రజలను మోసం చేస్తుందన్నారు. దుబ్బాక నియోజక వర్గ ప్రజలు ఆలోచించి హస్తం గుర్తుకు ఓటేసి తనను గె లిపిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంక ట్ స్వామి, బాల్‌నర్సుతోపాటు అక్బర్‌పేట భూంపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలి

- ఇంటింటి ప్రచారంలో కత్తి కార్తీక గౌడ్



దౌల్తాబాద్, నవంబర్ 28, మనం న్యూస్: దుబ్బాక బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా కత్తి కార్తీక గౌడ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంగళవారం మండ ల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని ఓట ర్లను అభ్యర్థించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను చూసి ప్రతిపక్షాలకు నిద్ర పట్టడం లేదని, రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కేవలం కొత్త ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యమ వుతుందన్నారు. మాయమాటలు చెప్పి చెప్పి మూడేళ్లు గద్దెనె క్కిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఎలాంటి అభివృద్ధి చేయక ని యోజకవర్గం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. కావున ప్రజ లు కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో ప్రభాకర్‌రెడ్డిని గెలి పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నర్సింహారెడ్డి, జిల్లాకో ఆప్షన్ రహీమొద్దీన్, ఏఎంసి డైరెక్టర్ నాగరాజుతోపాటు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ముంబై కెప్టెన్సీపై వార్తలు.. బుమ్రా క్రిప్టిక్ పోస్ట్ వైరల్!



టీమిండియా ఏస్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తాజాగా చేసిన క్రిప్టిక్ పోస్ట్ తెగ వైరల్ అవుతోంది. గతేడాది గాయంతో ఆటకు దూరమైన అతను.. చాలా కాలం పాటు క్రికెట్ ఆడలేదు. అయితే రీఎంట్రీలో అద్భుతంగా ఆడుతూ ఆకట్టుకుంటున్నాడు. ఈ క్రమం లోనే వచ్చే ఏడాది ఐపీఎల్లో అతని ప్రదర్శన కోసం ఫ్యాన్స్ తెగ వెయిట్ చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలో రాజకీయాలు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయి. గుజరాత్ టైటాన్స్ సారధి హార్దిక్ పాండ్యాను ముంబై ట్రేడింగ్ ద్వారా తమ జట్టులోకి తెచ్చుకుంది. రోహిత్ తర్వాత జట్టు పగ్గాలను అతనికి అందించాలనే ఆలోచనతోనే పాండ్యాను ముంబై కొనుగోలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో బుమ్రాకు కోపం వచ్చిందని, అతను తర్వాత కెప్టెన్ అవుదామని అనుకుం టున్నాడని కొందరు అన్నారు. రోహిత్ తర్వాత బుమ్రాకు ముంబై ఇండియన్స్ పగ్గాలు అందుతాయని చాలామంది అనుకున్నారు. కానీ ఇప్పుడు సడెన్గా పాండ్యా రీఎంట్రీతో ఈ ఈక్వేషన్స్ మారి పోయాయి. ఇది బుమ్రాను అప్సెట్ చేసిందని కొందరు వాది స్తున్నారు. అందుకే తను ముంబై ఫ్రాంచైజీని వదిలేసి వేరే టీంతో కలవాలని బుమ్రా అనుకుంటున్నట్లు పలు వార్తలు వచ్చాయి. వీటిపై ముంబై ఫ్రాంచైజీ కానీ, బుమ్రా కానీ స్పందించలేదు. ఇలాంటి సమయంలో తాజాగా సోషల్ మీడియా వేదికగా బుమ్రా చేసిన పోస్టు వైరల్ అవుతోంది. ఇన్స్టాగ్రాం స్టోరీలో 'ఒక్కోసారి మౌనమే సరైన సమాధానం' అని బుమ్రా పోస్టు పెట్టాడు. అతను ఇప్పుడు వస్తున్న వార్తలపై ఇలా స్పందించాడా? లేక ముంబై ఇండియన్స్లో పరిణామాలపై ఇలా రియాక్ట్ అయ్యాడా? అని ఫ్యాన్స్ చర్చించుకుంటున్నారు. ఫ్యాన్స్ మాత్రం ముంబైకి భవిష్యత్తులో బుమ్రానే కెప్టెన్గా చూడాలని అనుకుంటున్నట్లు చెప్తున్నారు. ఇప్పుడు పాండ్యా రావడంతో ఆ ఆశలన్నీ ఆవిరైపోయాయని అంటున్నారు. మరి ఫ్యూచర్లో ముంబై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# ఆ ఆసీస్ స్టార్ తిరిగొస్తే భారత్‌కు తిప్పలే..

- వీటి కోసం ఫ్యాన్స్ ఎదురు చూపు!

ఆస్ట్రేలియాతో మూడో టీ20కి భారత జట్టు రెడీ అవుతోంది. గువాహతి వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. మంగళవారం నాడు జరిగే ఈ మ్యాచులో కూడా గెలిచి సిరీస్ తమ ఖాతాలో వేసుకోవాలని భారత్ అనుకుంటోంది. అదే సమయంలో వరుసగా రెండు పరాజయాల తర్వాత ఎలాగైనా విజయం సాధించాలని ఆసీస్ కూడా పట్టుదలగా ఉంది. ఈ క్రమంలో మూడో టీ20లో కొన్ని అంశాలు ఫ్యాన్స్లో ఆసక్తిని రేపుతున్నాయి. అవేంటంటే?



### కెప్టెన్‌గా తొలి సిరీస్..

టీమిండియా కెప్టెన్గా తొలిసారి బాధ్యతలు అందుకున్న సూర్య కుమార్ యాదవ్.. తొలి రెండు మ్యాచుల్లో అద్భుతంగా రాణించాడు. తను ఆడటంతోపాటు కెప్టెన్సీలో కూడా తనదైన మార్కు చూపించిన అతను.. వరుసగా రెండు విజయాలు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక మూడో మ్యాచ్ కూడా గెలిస్తే.. కెప్టెన్గా ఆడిన తొలి సిరీసును ఖాతాలో వేసుకొనే ఛాన్స్ ఉంది. భారత్కు సారథ్యం వహించే అవకాశం రావడమే అరుదు. మరి ఆ అవకాశం వస్తే దాన్ని మరపురాని అనుభూతిగా మార్చుకోవాలనే అందరూ చూస్తారు కదా. సూర్యకు ఆ అవకాశం దక్కాలని ఫ్యాన్స్ అంతా కోరుకుంటున్నారు.

### వరల్డ్ కప్ హీరో రీఎంట్రీ?

భారత్తో జరిగిన తొలి రెండు మ్యాచుల్లో ఆసీస్ తమ పూర్తి బలమైన జట్టుతో బరిలో దిగలేదు. వన్డే వరల్డ్ కప్ తర్వాత తమ ప్లేయర్లకు ఆసీస్ మేనేజ్మెంట్ విశ్రాంతి ఇచ్చింది. అయితే రెండో మ్యాచులో మ్యాక్స్వెల్, ఆడమ్ జంపా, స్టొయినిస్ తదితరులు ఆడారు. కానీ వరల్డ్ కప్ ఫైనల్ హీరో ట్రావిస్ హెడ్ ఇంకా జట్టులోకి రాలేదు. అయితే అతను మూడో మ్యాచులో ఆడే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అతను కనుక తిరిగొస్తే.. భారత పేసర్లకు పెద్ద తలనొప్పి వచ్చి పడిందనే చెప్పాలి. ఎందుకంటే ఆరంభ ఓవర్లలో భారత పేసర్లు తడబడుతు న్నారు. ఆ సమయంలోనే హెడ్ చెలరేగుతాడు. అంతేకాదు, నిదానంగా ఆడుతున్న స్మిత్ను హెడ్ రిప్లేస్ చేసే అవకాశం ఉంది.

### గైక్వాడ్ స్థానానికి ఎసరు!

ఆసీస్తో చివరి రెండు మ్యాచులకు శ్రేయాస్ అయ్యర్ తిరిగొస్తున్నాడు. అతను వస్తే జట్టు వైస్ కెప్టెన్సీ కూడా అయ్యర్కే ఇచ్చేస్తారు. దీంతో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ స్థానం ప్రమాదంలో పడనుంది. ఇప్పటి వరకు రెండు మ్యాచుల్లో గైక్వాడ్ అంత గొప్పగా ఆడలేదు. ముఖ్యంగా అతని స్ట్రోక్ ప్లే ఆశించిన స్థాయిలో లేదు. అయ్యర్ ఎటూ టాపార్డర్లో ఆడాల్సిందే. అతని కోసం కిషన్ను పక్కన పెట్టడం కుదరదు. కాబట్టి గైక్వాడ్ను పక్కన పెట్టేయాలని మేనేజ్మెంట్ చూస్తోంది. వాళ్ల అభిప్రాయం మార్చాలంటే గైక్వాడ్ ఈ మ్యాచులో తప్పనిసరిగా రాణించాల్సి ఉంటుంది.

## గ్లేన్ ఫిలిప్స్ సంచలనం.. ఆలౌట్ ముంగిట బంగ్లాదేశ్!

న్యూజిలాండ్ పార్ట్ టైమ్ స్పిన్నర్ గ్లేన్ ఫిలిప్స్(4/53) సంచలన ప్రదర్శన చేశాడు. ఫుల్టైమ్ బౌలర్గా చెలరేగాడు. బంగ్లాదేశ్తో రెండు టెస్టు సిరీస్లో భాగంగా మంగళవారం ప్రారంభమైన తొలి టెస్టులో న్యూజిలాండ్ పట్టు బిగించింది. గ్లేన్ ఫిలిప్స్తో పాటు కైల్ జెమీసన్(2/52), అజాజ్ పటేల్(2/76) రెండేసి వికెట్లతో సత్తా చాటడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 9 వికెట్లకు 310 పరుగులు చేసింది. మహ్మదుల్ హసన్ జాయ్(166 బంతుల్లో 11 ఫోర్లతో 86) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో ఇష్ సోదీకి ఓ వికెట్ దక్కింది. ఈ మ్యాచ్లో టాస్ గెలిచి బ్యాటింగ్కు దిగిన బంగ్లాదేశ్కు ఆది లోనే గట్టి షాక్ తగిలింది. జకీర్ హసన్(12)ను అజాజ్ పటేల్ క్లీన్ బౌల్ చేశాడు. అనంతరం నిలకడగా ఆడే ప్రయత్నం చేస్తున్న నజ్ముల్ హొస్సేన్ షాంటో(37)ను గ్లేన్ ఫిలిప్స్ పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన మోమినల్ హక్(37)తో కలిసి మహ్మదుల్ హసన్ జట్టును ఆదుకు న్నాడు. మూడో వికెట్కు 88 పరుగులు జోడించాడు. మోమినుల్ హక్ను ఫిలిప్స్ కీపర్ క్యాచ్గా పెవిలియన్ చేర్చాడు. సెంచరీ దిశగా సాగుతున్న



మహ్మదుల్ హసన్(86)ను ఇష్ సోదీ ఔట్ చేశాడు. ఈ వికెట్తో బంగ్లా దేశ్ పతనం మొదలైంది. ముష్ఫికర్ రహీమ్(12)ను అజాజ్ పటేల్ ఔట్ చేయగా.. మెహ్ది హసన్ మీరాజ్(20)ను కైల్ జెమీస్ క్యాచ్ ఔట్గా పెవి లియన్ చేర్చాడు. కాసేపు నికలడగా ఆడిన నురుల్ హసన్(29)ను ఫలి ప్స్ ఔట్ చేయగా.. నయిమ్ హసన్(16)ను కైల్ జెమీసన్ కీపర్ క్యాచ్గా పెవిలియన్ చేర్చాడు. చివర్లో తైజుల్ ఇస్లామ్(8 బ్యాటింగ్), షోరిఫుల్ ఇస్లామ్(13 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా తొలి రోజు ఆటను ముగించారు. వికెట్ కీపర్ అయిన గ్లేన్ ఫిలిప్స్.. పార్ట్ టైమ్ స్పిన్నర్గా సత్తా చాటడం చూసి ఫ్యాన్స్ షాకవుతున్నారు. వన్డే ప్రపంచకప్లోనే తన బౌలింగ్ నైపుణ్యం చూపించిన ఫిలిప్స్.. టెస్టుల్లోనూ కొనసాగిస్తున్నాడు.

## కోహ్లీ రికార్డుపై కన్నేసిన రింకూ సింగ్..!

టీమిండియా యువ ఫినిషర్ రింకూ సింగ్ను అరుదైన ఘనత ఊరిస్తోంది. ఆస్ట్రేలియాతో జరుగుతున్నఐదు టీ20ల సిరీస్లో తొలి రెండు మ్యాచ్లో విధ్వంసకర బ్యాటింగ్తో చెలరేగిన రింకూ సింగ్.. భారత విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. వైజాగ్ వేదికగా జరి గిన తొలి టీ20లో ఆఖరి బంతికి సిక్స్ బాది చిరస్మరణీయ విజ యాన్ని అందించిన రింకూ సింగ్.. రెండో టీ20ల్లో 9 బంతుల్లోనే 31 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోర్ అందించాడు. తనదైన ఫినిషింగ్తో టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని తలపిస్తున్నాడు. యావత్ క్రికెట్ ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. ఈ ఏడాది ఐర్లాండ్తో జరిగిన టీ20 మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ క్రికెట్లోకి ఎంట్రీ ఇచ్చిన రింకూసింగ్.. ఇప్పటి వరకూ ఏడు టీ20 మ్యాచ్లు ఆడాడు. అందులో నాలుగు ఇన్నింగ్స్లో మాత్రమే బ్యాటిం గ్కు దిగే అవకాశం వచ్చింది. మూడు మ్యాచ్లో నాటౌట్గా నిలిచిన రింకూ సింగ్ ఇప్పటివరకూ 128 పరుగులు చేశాడు. అత్యధిక స్కోరు 38 పరుగులు. అయితే ఆడింది నాలుగు ఇన్నింగ్సులే అయినప్పటికీ రింకూ సింగ్.. విరాట్ కోహ్లీ, యువరాజ్ సింగ్ వంటి దిగ్గజాల సరసన చేరాడు. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్లో రెండు ఇన్నింగ్స్లో 344.44 స్ట్రైక్ రేట్తో రింకూ సింగ్ బ్యాటింగ్ చేశాడు. అయితే ఈ ఇన్నింగ్స్ ద్వారానే రింకూసింగ్ విరాట్ కోహ్లీ రికార్డును సమం చేశాడు. టీ20 క్రికెట్లో.. 19, 20 ఓవర్లలో 30కి పైగా పరు గులు చేసిన రెండో ఇండియన్ బ్యాటర్గా రింకూ సింగ్ చరిత్ర కెక్కాడు. అంతకుముందు విరాట్ కోహ్లీ ఈ ఫీట్ సాధించాడు. టీ20 క్రికెట్లో రింకూ సింగ్, విరాట్ కోహ్లీ ఇద్దరూ ఈ ఫీట్ చెరో రెండుసార్లు సాధించారు. ఆస్ట్రేలియాతో మూడో టీ20లో మరోసారి చివరి రెండు ఓవర్లలో రింకూ సింగ్ చెలరేగితే అత్యధిక సార్లు చివరి రెండు ఓవర్లలో 30కి పైగా పరుగులు చేసిన బ్యాటర్గా కోహ్లీని అధిగమిస్తాడు. మరోవైపు.. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20లో ఆడిన ఇన్నింగ్స్ ద్వారానే రింకూసింగ్ మరో అరుదైన ఘనతను సైతం అందుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఒక మ్యాచ్లో.. 25కు పైగా పరుగులు చేసిన సందర్భంలో అత్యధిక స్ట్రైక్రేట్తో బ్యాటింగ్ చేసిన నాలుగో ఇండియన్ ప్లేయర్గా కూడా రింకూ సింగ్ నిలిచాడు. ఈ జాబితాలో యువరాజ్ సింగ్, దినేశ్ కార్తీక్, హార్దిక్ పాండ్యా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. 2007 టీ20 ప్రపంచకప్లో 6 బంతుల్లో 6 సిక్సు బాదడం ద్వారా యూవీ ఈ ఫీట్ సాధించగా.. నిదహాస్ ట్రోఫీలో దినేశ్ కార్తీక్ ఒకే ఓవర్లో 29 పరుగులు పిండుకున్నాడు.




# ప్రమోషనల్ ప్లాన్ అదిరింది..

- నానితో యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా




అర్జున్ రెడ్డి ఫేం సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్లో వస్తున్న చిత్రం యానిమల్. బాలీవుడ్ స్టార్ హీరో రణ్బీర్కపూర్ టైటిల్ రోల్ పోషిస్తున్నాడు. కన్నడ బ్యూటీ రష్మిక మందన్నా హీరోయిన్గా నటిస్తోంది. యానిమల్ డిసెంబర్ 1న హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల కానున్న నేపథ్యంలో ప్రమోషన్స్లో బిజీగా ఉంది చిత్రయూనిట్. కాగా మరోవైపు న్యాచురల్ స్టార్ నాని నటిస్తోన్న చిత్రం తాజా చిత్రం హాయ్ నాన్న. ఈ మూవీ డిసెంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. నాని టీం కూడా ప్రమోషన్స్లో ఫుల్ బిజీగా ఉంది. కాగా యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ప్రమోషన్స్లో భాగంగా నానిని కలిశాడు. ఈ ఇద్దరి కాంబోలో ఓ ఇంటర్వ్యూ షూట్ చేయగా.. త్వరలోనే ఈ ఇంటర్వ్యూ ప్రీమియర్ కానుంది. ఈ మూవీ ప్రమోషన్స్లో భాగంగా ఇప్పటికే హైదరాబాద్లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు మేకర్స్. యానిమల్ చిత్రంలో బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, కృషన్ కుమార్, మురద్ ఖేతని నిర్మిస్తున్నారు. తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో నాని 30గా వస్తోన్న హాయ్ నాన్న చిత్రంలో బాలీవుడ్ భామ మృణాళ్ ఠాకూర్ హీరోయిన్గా నటిస్తోంది. ఈ చిత్రానికి శౌర్యువ్ (డెబ్యూ డైరెక్టర్) దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీని తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్గా విడుదల చేస్తున్నారు. హాయ్ నాన్న నుంచి లాంచ్ చేసిన సమయమా సాంగ్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ.. మ్యూజిక్ లవర్స్ను ఇంప్రెస్ చేస్తోంది. ఈ మూవీకి మలయాళం కంపోజర్, హృదయం ఫేం హేశమ్ అబ్దుల్ వహబ్ సంగీతం అందిస్తున్నాడు. ఈ మూవీని వైరా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్పై మోహన్ చెరుకూరి , డాక్టర్ విజేందర్ రెడ్డి తీగల, మూర్తి కేఎస్ తెరకెక్కిస్తున్నారు. మొత్తానికి వారం వ్యవధిలో వస్తున్న రెండు సినిమాలను ప్రమోట్ చేసుకునేలా నాని, సందీప్ రెడ్డి వంగా వేసుకున్న ప్రమోషనల్ ప్లాన్ అదిరిందంటున్నారు సినీ జనాలు.

## ధూత ప్రమోషన్స్‌లో నాగచైతన్య టీం..




కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలతో ఆకట్టు కునే యాక్టర్లలో ముందు వరుసలో ఉంటాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య. ఈ టాలెంటెడ్ యాక్టర్ విక్రమ్ కే కుమార్ దర్శ కత్వంలో నటించిన వెబ్ ప్రాజెక్టు ధూత. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో అమెజాన్ ప్రైమ్లో డిసెంబర్ 1 స్ట్రీమింగ్ కానుంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్లో బిజీ అయిపోయింది విక్రమ్ కుమార్ టీం. పార్వతి తిరువొత్తు, ప్రియా భవానీ శంకర్, ప్రాచీ దేశాయ్, విక్రమ్ కే కుమార్, చైతూ ప్రమోషనల్ క్యాంపెయిన్ను షురూ చేశారు. ప్రమోషన్స్లో భాగంగా ధూత టీం పలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తోంది. దీనికి సంబంధించిన స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. హారర్ థ్రిల్లర్ జోనర్లో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్లో పార్వతి తిరువొత్తు, ప్రియా భవానీ శంకర్, ప్రాచీ దేశాయ్ ఫీమేల్ లీడ్ రోల్స్లో నటిస్తున్నారు. ఇటీవలే ధూత ప్రమోషన్స్లో భాగంగా నాగచైతన్య ముంబైలో జరిగిన ఇండియా వర్సెస్ న్యూజిలాండ్ సెమీ ఫైనల్ మ్యాచ్లో కూడా సందడి చేశాడని తెలిసిందే. నాగచైతన్య మరోవైపు చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎన్సి23 సినిమాతో బిజీగా ఉన్నాడు. ఈ చిత్రానికి తండేల్ టైటిల్ను ఫిక్స్ చేశారు. ఇప్పటికే విడుదల చేసిన తండేల్ ఫస్ట్ లుక్లో చైతూ ఫిషర్మెన్ లుక్లో కనిపిస్తూ అభిమానులను ఖుషీ చేస్తున్నాడు. ఫిషర్మెన్ స్టోరీ బ్యాక్డ్రాప్లో రాబోతున్న ఎన్సి23ని పాపులర్ బ్యానర్ గీతా ఆర్ట్స్పై తెరకెక్కిస్తోంది.

మనం సినిమా

manamcinema

## సాయిపల్లవి సినిమా కోసం వెయిటింగ్ ఇక్కడ.. !

దక్షిణాది సినీ పరిశ్రమలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ హీరోయిన్ల జాబితాలో టాప్లో ఉంటుంది సాయిపల్లవి. ఈ కోలీవుడ్ సోయగం అందం, అభినయం, డ్యాన్స్.. ఇలా ఏ విషయంలో కూడా తగ్గేదేలే అనే ఫార్ములాను పర్ఫెక్ట్గా అప్లై చేస్తుంటుంది. ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులను ఫిదా చేసేసిన ఈ బ్యూటీ శ్యామ్ సింగరాయ్, గార్గి సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ సంపాదించుకుంది. సాయిపల్లవి చివరి సినిమా విరాటపర్వం 2022 జూన్లో విడుదలైంది. ఆ తర్వాత గార్గి సినిమా గతేడాది జులైలో డైరెక్టుగా ఓటీటీలో విడుదలైంది. ఇక అప్పటి నుంచి ఈ భామ నుంచి కొత్త సినిమాలేవి విడుదల కాలేదు. సాయిపల్లవి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్తో కలిసి నటిస్తోన్న చిత్రం ఎస్కె21. తాజాగా కోలీవుడ్ సర్కిల్లో రౌండప్ చేస్తున్న కథనాల ప్రకారం ఎస్కె21 ఆగస్టు 2024లో గ్రాండ్గా విడుదల కానుందట. ఇదే నిజమైతే అభిమానులు సాయిపల్లవిని బిగ్ స్క్రీన్పై చూడా లంటే రెండేళ్ల తర్వాత సాధ్యం కానుందన్న మాట. ఈ లెక్కన సుదీర్ఘకాలం కొత్త సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానుల్లో కేవలం సాయిపల్లవి ఫ్యాన్స్ మాత్రమే టాప్లో ఉంటార నడంలో ఎలాంటి సందేహం లేదు. ఎస్కె21 చిత్రానికి రాజ్కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తు న్నాడు. ఈ చిత్రంలో విశ్వరూపం ఫేం రాహుల్ బోస్ విలన్గా నటిస్తున్నాడు. ఇప్పటికే సాయిపల్లవి కశ్మీర్ లొకేషన్లో దిగిన స్టిల్స్ నెటిజన్లను ఇంప్రెస్ చేస్తున్నాయి. మరోవైపు చందూ మొండేటి డైరెక్షన్లో నాగచైతన్య నటిస్తోన్న తండేల్లో ఫీమేల్ లీడ్ రోల్లో నటిస్తోంది సాయిపల్లవి. లవ్ స్టోరీ తర్వాత ఈ ఇద్దరి కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Nava Telangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godhavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar. 505001, Telangana. Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2017/73893. E-mail Id: editor@manamnews.com.